J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 22 03.11.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

● బెయిలుపై జైలు నుండి బయటకొచ్చిన బాబు

## నారా కారాగార కథకి...

# విరామమా... సమాప్తమా?



➤ జైలు.. బెయిలు క్రమంలో ఎవరు పాసు? ఎవరు ఫెయిలు?

➤ బాబుకి 17-ఏ వర్తిస్తుందని సుప్రీం కోర్టు తీర్పు చెప్తే... తరువాత గురి చినబాబు పైనేనా?

➤ 23 సీట్లతో అస్థిపంజరంలా మారిన టీడీపీకి... వైసిపి నేతలు పోటీపడి మరీ రక్తమాంసాలు ఎక్కించి పునర్జన్మ ఇచ్చారా?

ఒక్క బెయిలు... వంద ప్రశ్నలు!

*ఎట్టకేలకు 52 రోజుల తరువాత బాబు బెయిలుపై బయటకి వచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డి 16 నెలలు జైలులో ఉన్నారు కాబట్టి, బాబుని కనీసం 160 రోజులన్నా లోపల ఉంచాలన్న జగన్ వీరాభిమానుల కోరిక తీరలేదు. బాబుని అరెస్టు చేసినప్పటినుండీ సంబరాలు చేసుకుంటున్న వైసీపీ శ్రేణులకు బాబుకి బెయిలు రావడం అన్న విషయం మింగుడుపడడం లేదు. అనారోగ్యమా..? అసౌకర్యమా...?? కారణం ఏదైనా ఇక్కడ బాబు బయటకి వచ్చాడన్నదే కీలక అంశం. చంద్రబాబు అరెస్టు, ఆ తరువాత న్యాయస్థానాలు పలుదఫాలు బెయిలు నిరాకరించడం వంటి పరిణామాలన్నీ కేవలం జగన్‌మోహన్‌రెడ్డి కోరిక ప్రకారం జరుగుతున్నాయా..? లేక కేంద్ర పెద్దల ఆదేశాల ప్రకారం జరుగుతున్నాయా..?? అన్న అనుమానం రాజకీయ వర్గాల నుండి వ్యక్తమవుతోంది.*

ఇలాంటి తరుణంలో చంద్రబాబును వీలైనంత ఎక్కువగా ఇరుకునపడేసి, సాధ్యమైనంతవరకు ఇబ్బంది పెట్టాలని భావించిన వైసీపీ అధినేత జగన్... ఈ అంశాన్ని తాను అనుకున్నంత స్థాయిలో హ్యాండిల్ చేయగలిగారా...? చంద్రబాబు నాయుడుని ప్రజా కోర్టులో అవినీతిపరుడుగా జగన్ ప్రభుత్వం నిలబెట్టగలిగిందా...?? చంద్రబాబు అరెస్టుతో జనంలో వైసీపీ ప్రతిష్ట పెరిగిందా... తరిగిందా....??? బాబుకి ఇప్పుడు లభించింది 'మధ్యంతర' ఉపశమనమే కనుక ఆయన మళ్లీ జైలుకి వెళ్తారా... వెళ్లరా...???? ఇవన్నీ ఇప్పుడు అన్ని ప్రధాన రాజకీయ పార్టీల శ్రేణుల ముందున్న భేతాళ ప్రశ్నలు.

స్కిల్ స్కామ్ నేరారోపణతో 52 రోజులు రాజమండ్రి కారాగారంలో వున్న నారా బాబుకి అక్టోబర్ 31వ తేదీ మంగళవారం 'మధ్యంతర' బెయిల్ వచ్చిన విషయం యావత్ రాజకీయ ప్రపంచానికి తెలిసిందే. బెయిల్ మంజూరు చేయడం తప్ప మరో అవకాశం లేని కారణాలను న్యాయస్థానం ముందు ఉంచడంతో బెయిల్ మంజూరైంది. అనారోగ్య కారణాలతో బెయిల్ పొందారు, కాబట్టి జైలు నుంచి నేరుగా ఆస్పత్రికి వెళ్ళుండాలి. రాజమండ్రిలో కూడా 'స్వతంత్ర హాస్పిటల్స్' అనే కార్పొరేట్ ఆసుపత్రి ఉంది. అది కూడా తమ టీడీపీకి చెందిన నాయకుడు గన్ని కృష్ణ కుటుంబానికి చెందిన హాస్పిటలే. నిజానికి, జైలు నుంచి విడుదల కాగానే, ప్రాథమిక చికిత్స కోసం ఆయన ఆ ఆసుపత్రిలో చూపించుకొని ఉండాలి. ఒకవేళ తమ పార్టీ నాయకులు, కార్యకర్తల హడావుడి మధ్య రాజమండ్రిలో వైద్యులకు చూపించుకోవడం కష్టతరం అని ఆయన భావించి ఉంటే, జైలు నుండి నేరుగా విమానాశ్రయానికి వెళ్లి అక్కడ నుండి ప్రత్యేక

10లో




'లెజెండ్స్ లీగ్ క్రికెట్ టీ20' టీమ్‌ని కొనుగోలు చేసిన మన నెల్లూరీయుల సంస్థ

# 'అర్బన్ రైజర్స్ హైదరాబాదు'గా నామకరణం

*భారతదేశంలో వివిధ ప్రాంతాలలో జరగనున్న లెజెండ్స్ లీగ్ క్రికెట్ టీ20 మ్యాచ్‌లకి సంబంధించిన 6 టీములలో ఒక దాన్ని మన నెల్లూరీయులు నంబూరు మనోజ్, బొమ్మిరెడ్డి సునీల్‌లకి సంబంధించిన నిర్మాణ - రియల్ ఎస్టేట్ సంస్థలు అలయన్స్, అర్బన్‌రైజ్‌లు సొంతం చేసుకున్నాయి. ఈ పోటీలకు మొత్తం 6 టీములు ఎంపిక కాగా, వాటిలో మొదటిది మన నెల్లూరీయులది. దానికి "అర్బన్ రైజర్స్ హైదరాబాద్" అని నామకరణం చేశారు. చాన్నాళ్ళకి మనవాళ్ళు హైదరాబాదు పేరుకి ప్రాధాన్యత కల్పించడం గమనార్హం.*

రెండవది అదానీ కైవసం చేసుకుని 'గుజరాత్ జయింట్స్' అని పేరు పెట్టారు. మూడవది మన రాష్ట్రానికే చెందిన జిఎంఆర్ సంస్థ సొంతం చేసుకుని, ఆ టీమ్‌కి 'ఇండియా క్యాపిటల్స్' అని టైటిల్ పెట్టుకున్నారు. నాలుగవదాన్ని ఝున్ ఝున్ వాలా కుటుంబం కొనుగోలు చేసి తమ టీమ్‌ని

10లో



# విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిన.. 'ఓపెన్‌హౌస్'



విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఇటీవల జిల్లా ఎస్పీ డా. కె.తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో సుమారు వెయ్యిమంది బాలబాలికలకు పోలీసు సేవల పట్ల అవగాహన కల్పించారు. పోలీసులకు ప్రజలకు సత్సంబంధాలుండాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో స్ఫూర్తిని కలిగించింది. విద్యార్థులతో జిల్లా ఎస్పీ కలుపుగోలుగా మాట్లాడుతూ, వారు అడిగిన అనేక సందేహాలకు చిరునవ్వుతో సమాధానాలిచ్చారు. విద్యార్థులంతా మంచి నడవడికతో బాగా చదువుకుని ఉన్నతస్థానాల్లో రాణించాలని ఎస్పీ ఆకాంక్షించారు. అనంతరం, పోలీసు అధికారులతో కలసి పోలీసు శాఖ శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజల రక్షణకు చేస్తున్న కార్యక్రమాలను ఓపిగ్గా వారికి వివరించారు. బాంబు డిస్పోజల్ టీమ్ వాడే పరికరాలు, డ్రోన్లు, డాగ్‌స్క్వాడ్ బృందాల పనితీరు, మెటల్ డిటెక్టర్స్, కమ్యూనికేషన్ పరికరాలు, దిశ యాప్ ఉపయోగాలు, ఫింగర్ ప్రింట్స్, విపత్తుల సమయాల్లో పోలీసులు బాధితులను ఆదుకుంటూ చేస్తున్న సేవలు వగైరాలన్నిటినీ వారికి అర్థమయ్యేవిధంగా విశదీకరించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఆ విషయాలను తెలుసుకున్నారు.

## కోవూరులో 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ'



కోవూరులో ఇటీవల వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం జరిగింది. ఐసీడిఎస్ వారు ఏర్పాటుచేసిన స్టాల్‌ను ఏఎంసి ఛైర్మెన్ రాధాకృష్ణారెడ్డితో కలసి, రాష్ట్ర వ్యవసాయ సలహామండలి సభ్యులు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి సందర్శించి, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పోషకాహార కిట్‌లలో బల వర్ధకమైన పోషకాహార పదార్థాలు ఉన్నాయని, గర్భిణులు, చిన్నారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులు రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీడిఓ శ్రీహరి, పడుగుపాడు సొసైటీ ఛైర్మెన్ ఆర్. మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ వేణు గోపాల్, కోఆప్షన్ సభ్యులు జుబేర్‌బాషా, వేమారెడ్డి శివకుమార్‌రెడ్డి, నాయకులు ప్రసాద్, పలువురు వైద్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



## ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు

**- మాజీమంత్రి ఆనం**

రాష్ట్రంలో యధేచ్ఛగా ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారని, ఇసుక, గ్రావెల్‌తో పాటు చివరికి తెల్లరాయిని కూడా దోచుకుంటున్నారని మాజీమంత్రి, వెంకటగిరి శాసనసభ్యుడు ఆనం రామనారాయణరెడ్డి ధ్వజమెత్తారు. ఇటీవల ఆయన నెల్లూరులో జనచైతన్యవేదిక ఆధ్వర్యంలో 'ఉమ్మడి నెల్లూరుజిల్లా సమగ్రాభివృద్ధి'పై జరిగిన చర్చలో పాల్గొని తన అభిప్రాయాలను వెల్లడించారు. రాష్ట్రంలో మనుషులకే రక్షణ లేదని, ఇక ప్రకృతి వనరులకు రక్షణ ఏముంటుందని దుయ్యబట్టారు. అన్ని పార్టీలవారు తమ సిద్ధాంతాల్లో అవసరమైన మార్పులు చేసుకునైనా సరే, కలసికట్టుగా కృషి చేసినప్పుడే అభివృద్ధికి బాటలు పడతాయన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ లేకపోవడం సిగ్గుచేటని, దానిని ఆత్మకూరులో ఏర్పాటుచేద్దామని ప్రయత్నిస్తే అడ్డుకున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, జనచైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సిపిఎం నాయకుడు మూలం రమేష్, సిపిఐ నాయకుడు దామా అంకయ్య, జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి, ప్రజాసైన్స్ ఉద్యమనాయకుడు మాల్యాద్రి, ఎం.మాలకొండారెడ్డి, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సైదాపురంలో ధర్మప్రచార వారోత్సవాలు

సైదాపురంలో ఇటీవల ధర్మప్రచార వారోత్సవాలు జరిగాయి. హిందూ ధర్మం, సంప్రదాయాలపై దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ప్రచార రథంతో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం, జడ్పీహైస్కూల్ ప్రాంగణంలో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# కరువు కోరల్లో పల్లెలు.. నిర్లక్ష్యంగా పాలకులు



- వానలు లేక బీడుగా మారుతున్న పంటపొలాలు
- ఎండిపోయిన చెరువులు.. అడుగంటిన జలాశయాలు
- వలసలు పోతున్న కష్టజీవులు.. పట్టించుకోని అధికారులు

**వరికి పుట్టినిల్లయిన నెల్లూరుజిల్లా కరువు కోరల్లో చిక్కుకుపోతోంది. పాడిపంటలతో కళకళలాడే జిల్లా..అటు వానలు రాక, ఇటు సాగునీరు వనరులు లేక ఎండుముఖం పడుతోంది. వ్యవసాయ సీజన్ మొదలైనా చినుకులు పడకపోవడం, చెరువులు దొరువులన్నీ ఎండిపోతుండడం, జలాశయాల్లో నీరు అడుగంటిపోతుండడంతో రైతులు రబీ పంటలపై ఆశలు వదులుకుంటున్నారు. వాస్తవానికి ఈ సీజన్ వానాకాలమైనా, మండు వేసవిలా ఎండలు మండిపోతున్నాయి. పొలాల్లో పంటలు లేకపోవడంతో మూగజీవాలకు పచ్చగడ్డి కూడా దొరకడం లేదు. మరికొద్ది రోజులు ఇదేవిధంగా కొనసాగితే రైతుల జీవితాలు అస్తవ్యస్తంగా మారిపోతాయి. అయినా, అటు పాలకులకు కానీ, ఇటు అధికారగణానికి కానీ చీమ కుట్టినట్లు కూడా లేదు. రైతులకు, రైతు కూలీల ఉపాధికి ప్రత్యామ్నాయమార్గాలు చూపించడం లేదు. పాలకులు, నాయకులు ఎన్నికల మీదే దృష్టి పెట్టి, ఓట్లు ఎలా మూటగట్టుకోవాలా అని చూస్తున్నారే తప్ప ప్రజల సమస్యలు కానీ, అందరికీ అన్నంపెట్టే అన్నదాతల బాధలు కానీ పట్టించుకునే స్థితిలో లేకపోవడం విచారకరం.**

జిల్లాలో ఇప్పుడు తీవ్ర వర్షాభావం రైతులను కుంగదీస్తోంది. సాధారణంగా జూన్ నుంచి అక్టోబరు దాకా జిల్లాలో వర్షాలు బాగా కురిసేవి. సీజన్ మొదలైనా వర్షాలు లేకపోవడంతో రైతులు వరుణుడి కరుణ కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. జిల్లాలో వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. దాదాపు 70 శాతం జనాభా వ్యవసాయం మీదే ఆధారపడి ఉన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు, వారి కుటుంబాలన్నీ సేద్యంతోనే మనుగడ సాగిస్తున్నాయి. అయితే, జిల్లాలోని మెట్ట ప్రాంతాలతో పాటు, డెల్టా ప్రాంతాల్లో కూడా సాగునీరు అందుబాటులో లేకపోవడంతో రైతుల జీవనం కుదేలైపోతోంది. పంట పొలాలన్నీ బీడుభూములుగా మారిపోతున్నాయి.

ఈ సీజన్‌లో పాడిపంటలతో కళకళలాడాల్సిన పల్లెలు, పంటపొలాల్లో పనులు లేక, ఉపాధి కోసం అలమటిస్తున్నారు. అక్కడక్కడా స్వల్పంగా వేసుకున్న పంటలు కూడా వానలు లేక, సాగునీరు అందుబాటులో లేక ఎండిపోతున్నాయి. పంట కాలువలు, నదులు, చెరువులు దొరువులన్నీ ఎండిపోయాయి. ఎక్కడా చుక్క నీరు కనిపించడం లేదు. అనేక గ్రామాల్లో ఇప్పటికే తాగునీటికే కటకటగా ఉంది. ఇక సాగునీరెక్కడ?...

### నీటి వనరుల పట్ల శ్రద్ధలేని పాలకులు

జిల్లాలో నీటి వనరుల పట్ల పాలకులకు కనీస శ్రద్ధ ఉండడం లేదు. పేరుకు పలు ప్రాజెక్టులు ఉన్నా, నీళ్లు లేకపోతే ఏం చేయాలో ముందస్తు ప్రణాళికలపై ఎవరికీ ఆలోచన లేదు. వానలు, వరదలు వచ్చినప్పుడు ఆ ప్రవాహమంతా వృధాగా సముద్రంలో కలసిపోతున్నా, నీటిని నిల్వచేసుకునేందుకు ప్రయత్నాలు చేయడం లేదు. కొత్త ప్రాజెక్టులు అసలు లేవు. ఎప్పటికప్పుడు నీరు పొదుపుగా వాడుకోవాలంటూ ఊకదంపుడు మాటలే తప్ప, ఎక్కడికక్కడ పెద్దఎత్తున చెక్‌డ్యామ్‌ల వంటి ఏర్పాట్లపై ప్రణాళికలు శూన్యం. ఏళ్ళ తరబడిగా ఇదే నాన్చుడు వ్యవహారం తప్ప, రైతుల బాధలకు శాశ్వత ప్రాతిపదికన పరిష్కారం చూపే నాధులే కరువయ్యారు. కరువు పరిస్థితులను అధిగమించేందుకు ముందస్తు ఆలోచనలు చేయడం లేదు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ రైతులను అప్రమత్తం చేయాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండడంతో జిల్లా అంతటా కరువు మేఘాలు కమ్ముకుంటున్నాయి. వ్యవసాయశాఖ, నీటి పారుదల శాఖ, వాతావరణ శాఖ, ఇలా బోలెడు శాఖలు, వేలసంఖ్యలో అధికారగణం ఉన్నా ఎవరికి వారు తమ పనులు చక్కబెట్టుకోవడం తప్ప రైతన్నల వెతలను పట్టించుకోవడంలేదు. దేవుడి దయతో వానలు కురిసి పంటలు పండితే, అంతా తమ ఘనతేనని గొప్పలు చెప్పుకోవడం, వానలు రాకుంటే పంటలు వేసుకోవద్దని రైతులకు హుకుంలు జారీ చేసి చేతులు దులుపుకోవడం పాలకులకు అలవాటైపోయిందని, అధికారులు కూడా అదే దోవలో నడుస్తూ తమకు తీరని అన్యాయం చేస్తున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



### అడుగంటిపోతున్న జలాశయాలు :

జిల్లా రైతాంగానికి ప్రాణప్రదమైన సోమశిల, కండలేరు జలాశయాల్లో నీరు అడుగంటిపోయాయి. సోమశిల జలాశయం గత ఏడాది నిండా నీటితో నిండుకుండలా ఉండేది. ఇప్పుడు ఎండుముఖంతో జలకళ కోల్పోయింది. దీంతో మెట్ట ప్రాంతాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. సోమశిల పూర్తి నీటి సామర్థ్యం 77 టీఎంసీలైతే, గత ఏడాది ఇదే సీజన్‌లో 66 టీఎంసిల నీరు ఉండేది. సాగునీటికి ఇబ్బంది లేకుండా కనీసం అయిదున్నర లక్షల ఎకరాలకు నీటి కేటాయింపులు జరిగేవి. ఇప్పుడు కేవలం 30 టీఎంసిల నీరు మాత్రమే ఉండడంతో, పొలాలలకు నీరందించలేమని అధికారులు చేతులెత్తేశారు.

అదేవిధంగా 68 టీఎంసీలు నిల్వచేసే సామర్థ్యమున్న కండలేరు జలాశయంలో గత సీజన్‌లో 53 టీఎంసీల నీరుంటే, ఇప్పుడు అది 11 టీఎంసిలకు కుదించుకుపోయింది. దీంతో సుమారు మరో రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు లేక పొలాలన్నీ బీడుపడిపోతున్నాయి. ఈ రెండు ప్రధాన జలాశయాల్లో నీళ్ళు లేకపోవడం, అక్టోబరు ముగిసినా వానలు కురవకపోవడంతో ఈ సీజన్‌లో పంటలపై రైతులు ఆశలు వదులుకోవాల్సి వస్తోంది. ఎక్కడా పొలాల్లో దుక్కి దున్నడాలు, నార్లు వేసుకోవడాల వంటివేమీ కనిపించడం లేదు. ఇంతటి దుస్థితి ఇటీవలి కాలంలో ఎప్పుడూలేదు. చివరికి, బతుకుజీవనం కోసం అనేక గ్రామాల్లో రైతులు, రైతుకూలీలు ఏదో ఒకపనిచేసుకుని బతుకుదామని పొట్టచేత పట్టుకుని ఇతర ప్రాంతాలకు, నగరాలకు వలసలు పోతున్నారు. జిల్లాలో ఇంత దయనీయమైన పరిస్థితులున్నా నాయకుల్లో కానీ, అధికారుల్లో కానీ చలనం ఉండడంలేదు.

# ఆర్ఎస్ఎస్ ఆశీస్సులు.. ఏబీవీపీ మార్గదర్శకత్వంలో రాణించా!

## - భారత పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఏబీవీపీ (అఖిల భారతీయ విద్యార్థి పరిషత్)తోపాటే తాను కూడా 1949లో పుట్టానని, ఈ 75సంవత్సరాల్లో తనను ఉప రాష్ట్రపతి స్థాయికి తీసుకురావడంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆశీస్సులతోపాటు, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మార్గదర్శకత్వం ఎంతైనా ఉందని ఏబీవీపీ మాజీ జాతీయ కార్యదర్శి, భారత పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పారు. అదే విధంగా, బీజేపీలో వివిధ బాధ్యతలలో అసెంబ్లీ మరియు పార్లమెంటులో చట్టసభ సభ్యులుగా విధులు సమర్థవంతంగా నిర్వహించడంలో ఏబీవీపీలో నేర్చుకున్న క్రమశిక్షణ, సమయ పాలన, కార్యదక్షత వంటి అంశాలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ స్థాపించి 75 సంవత్సరాలైన సందర్భంగా నిర్వహించిన ఏబీవీపీ అమృత్యోత్సవాలలో భాగంగా ఇటీవల విజయవాడలోని స్వర్ణభారత్ ట్రస్టులో ఏబీవీపీలో గత 75 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిన పూర్వ కార్యకర్తల సమావేశంలో వెంకయ్యనాయుడు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పూర్వ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రపంచంలో భారతదేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకు రాష్ట్రీయ స్వయం సేవక సంఘ పరివార సంస్థల సభ్యులందరిపై గురుతర బాధ్యత ఉందని చెప్పారు. పూర్వ కార్యకర్తలు రాజకీయాలు, వ్యాపారాలు, ఉద్యోగాలు, సామాజిక సేవ వంటి ఏ రంగంలో ఉన్నప్పటికీ ఆ రంగాలలో నీతి నిజాయితీకి కట్టుబడి ఏబీవీపీ నినాదమైన 'జ్ఞానం, శీలం, ఏకత' అనే అంశాన్ని స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ మురళీధర్, కార్యదర్శి యాచేంద్ర అతిథులుగా పాల్గొనగా, ప్రధానవక్తగా భారతీయ మజ్దూర్ సంఘ జాతీయ సంఘటన కార్యదర్శి సురేంద్రన్ పాల్గొని ఏబీవీపీ కార్యక్రమాల విశిష్టతను వివరించారు. విశిష్ట అతిథులుగా గతంలో ఏబీవీపీలో వివిధ బాధ్యతలలో పనిచేసిన ప్రస్తుత బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు శేఖర్‌జీ, ఏబిఆర్ఎస్ఎం జాతీయ సహ సంఘటన కార్యదర్శి జి.లక్ష్మణ్‌జీ, బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్, ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై.వి రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పి.వి మాధవ్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేందర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఎన్.రమేష్ నాయుడు, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్, రాష్ట్రీయ స్వయం సేవక సంఘ ప్రాంత ప్రచారక్ విజయ ఆదిత్య, బీజేపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి మధుకర్‌జీ, ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకులు యుగంధర్, ఏబీవీపీ జాతీయ సహ సంఘటన కార్యదర్శి బాలకృష్ణ, రాష్ట్ర సంఘటన కార్యదర్శి శివకుమార్ పాల్గొని కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు.

# సామాన్యులకు కూడా న్యాయసహాయం అందాలి

## --- రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ---



వైకాపాలో లీగల్‌సెల్ విభాగంలో మంచి టీమ్ ఉందని, వారి ఆధ్వర్యంలో సామాన్య ప్రజలకు కూడా న్యాయ సహాయం అందాలని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పార్టీ ఆకాంక్షించారు. నవంబరు 1న నెల్లూరులో జరిగిన వైకాపా లీగల్ సెల్ సదస్సులో ఆయన మాట్లాడారు. ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి కార్యక్రమాలను ఉధృతం చేస్తూ ప్రజలకు మంచి సేవలు అందిస్తున్నారని, ఆయనతోపాటు జోనల్ ఇన్‌ఛార్జి రోజారెడ్డి, ఇతర సభ్యులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని ఆయన అన్నారు. పట్టణాల్లో ఓటింగ్ శాతం తగ్గిపోతుందని, దాన్ని పెంచేందుకు అందరూ కృషిచేయాలన్నారు. ప్రతి ఒక్కరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తాను ఎంపీగా పోటీ చేస్తున్నానని, అందుకు మీ అందరి మద్దతు కావాలని ఆయన కోరారు. వైకాపా లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి రామిరెడ్డి రోజారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలసి ఆయన జ్యోతి ప్రజ్వలనచేసి, అనంతరం దివంగత మహానేత డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం పలువురు ప్రముఖులు వేమిరెడ్డి దంపతులను సన్మానించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, టీటీడీ ఢిల్లీ స్థానిక సలహామండలి ఛైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.మనోహర్‌రెడ్డి, జోనల్ ఛైర్‌పర్సన్ రోజారెడ్డి, లోకల్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వర్, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైకాపా నాయకుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి పాల్గొన్నారు.

# జిల్లాలో చెదురుమదురు వానలు

ఎట్టకేలకు అక్టోబరు చివరివారంలో జిల్లాలో చెదురుమదురు వానలు కురిశాయి. పలు మండలాల్లో వర్షం కురిసినా, అది కూడా సగటు వర్షపాతం కంటే తక్కువే. జిల్లాలోని 38 మండలాల్లో 20 మండలాల్లోనూ అతికొద్ది వానే కురిసింది. సాధారణంగా ఈ రోజుల్లో మంచివానలు కురవాల్సి ఉండగా, వరుణుడు కరుణించకపోవడంతో వ్యవసాయ సీజన్ సగం దాటిపోయినా చినుకులు పడలేదు. ఇప్పుడు ఒకటి రెండు రోజులుగా వానలు అక్కడకక్కడా కురుస్తున్నా అదునుకు పదునైన వానలు పడకపోవడంతో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. నెల్లూరు నగరంలోనూ గత నాలుగైదు రోజులుగా ఒకమోస్తరు వాన కురవడంతో, ఎండ వేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం కలిగింది.



## 'విద్య-విజ్ఞానం-వికాసం'

# అదే.. 'స్వర్ణభారత్'

భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్ఫూర్తితో.. విద్య, విజ్ఞానం, వికాసం ధ్యేయంగా స్వర్ణ భారత్ విద్యామందిర్ ఏర్పాటైందని నిర్వాహకులు తెలిపారు. దసరా సెలవుల్లో రాష్ట్రీయ స్వయంసేవక్ శిక్షణ పూర్తిచేసుకుని వచ్చిన విద్యార్థులను స్వర్ణభారత్ ట్రస్ట్ ట్రస్టీ దీపా వెంకట్ సూచన మేరకు వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో ఇటీవల అభినందించారు. గ్రామీణాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందనే సంకల్పంతో స్వర్ణభారత్ ముందుకు సాగుతోందని వక్తలు పేర్కొన్నారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణభారత్ ట్రస్ట్ సమన్వయకర్త జనార్దన్‌రాజు, అక్షర విద్యాలయ ప్రిన్సిపాల్ కుముద, స్వర్ణభారత్ విద్యామందిర్ ప్రిన్సిపాల్ సులోచన తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సమస్యలు తీర్చండి

రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిశీలించి పరిష్కరించాలంటూ బీజేపీ గిరిజనమోర్చా ఆధ్వర్యంలో అక్టోబరు 30న నెల్లూరు కలెక్టరేట్ వద్ద గిరిజన మహిళలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. గిరిజనుల ఇళ్ల నిర్మాణాలను అనేకచోట్ల తలుపులు ద్వారబంధాలు లేకుండా మధ్యలోనే వదిలేశారని, వాటిని వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు శ్రీనివాసులు, ప్రసాద్, రాజేశ్వరి, వెంకటరమణయ్య పాల్గొన్నారు.



## దివ్యక్షేత్రాల దర్శనంతో..

# పులకించిన 'అక్షర' విద్యార్థులు

- నేపాల్ వెళ్ళారు.. హిమాలయాలను కూడా చూశారు
- దీపమ్మ చొరవతో విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు

నెల్లూరుజిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని అక్షర విద్యాలయం విద్యార్థులు ఇటీవల దసరా సెలవుల్లో అత్యద్భుతమైన విజ్ఞాన విహార యాత్ర చేశారు. విద్యాలయం కరెస్పాండెంట్, భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కుమార్తె దీపా వెంకట్ సహకారంతో, దేశంలోని అనేక దివ్యమైన ప్రాంతాలను, ఆలయాలను సందర్శించి, ఆహ్లాదకర వాతావరణంలో గడిపి, ఆసక్తికరమైన విజ్ఞాన దాయకమైన విషయాలెన్నో తెలుసుకున్నారు. నేపాల్ దేశంలోని ఖాట్మండులో ఉన్న పోఖారాలో కూడా నాలుగు రోజుల సాహసోపేతమైన యాత్ర చేశారు. విమానంలోంచి సుందరంగా కనిపించే హిమాలయాలను కూడా చూసి ముగ్ధులయ్యారు. హరిద్వార్‌లో యోగా గురువు బాబా రామ్‌దేవ్‌జీని కలుసుకున్నారు. పవిత్రమైన గంగానదిని దర్శించుకుని తరించారు. ఇతర రాష్ట్రాల్లోని అద్భుతమైన క్షేత్రాలతోపాటు, నేపాల్ దేశంలోనూ యాత్ర చేసి అపూర్వమైన జ్ఞాపకాలను తమ మనసుల్లో పదిల పరచుకోవడం నిజంగా.. అక్షర విద్యాలయ విద్యార్థుల అదృష్టమే మరి!..



విద్యార్థులను, అధ్యాపకులను, వారితోపాటు పనివత్తిడిలో ఆటవిడుపుగా ఉంటుందని కొంతమంది సిబ్బందిని దీపా వెంకట్ పలు పుణ్యక్షేత్రాలకు, నేపాల్‌కు పంపి వారికి చక్కని విజ్ఞానానుభూతులను కలుగజేశారు. అక్కడి చల్లటి వాతావరణం, హిమాలయాల్లోని అన్నపూర్ణ పర్వత శ్రేణిని చూసి కలిగే అవ్యక్తానుభూతిని అందిద్దామనే ఆలోచనతో, అనుకుందే తడవుగా అన్ని ఏర్పాట్లు చేశారు. చెన్నై నుండి ఢిల్లీ వరకు విమానం ద్వారా వెళ్ళి, అక్కడినుండి ఏసీ బస్సులో హరిద్వార్‌లోని పతంజలి యోగపీఠ్‌ను సందర్శించి, బాబా రామ్‌దేవ్‌ను కలిసి, మర్నాడు ఉదయం బస్సుకు బదులుగా, సంస్థ ఖర్చుతో విమానంలోనే ఖాట్మండు వెళ్లే ఏర్పాట్లు కూడా చేశారు.

### నేపాల్ యాత్ర :




నేపాల్‌లోని ప్రపంచ ప్రఖ్యాత యునెస్కో వారసత్వ ప్రదేశాలను దర్శించుకున్నారు. స్వయంభూనాథ్ స్తూపం, జల్ నారాయణ్ (బుధ నీలకంఠ గుడి) గుడిని, ఆ తర్వాత పశుపతినాథ్ గుడిని దర్శించుకుని, మర్నాటి సాయంత్రానికి పోఖరా చేరారు. ప్రశాంతమైన ప్రదేశంలో ఉన్న శాంతిస్తూపం, శాంతి పగోడాను సందర్శించారు. అక్కడి నుండి గుప్తేశ్వర్ గుహలను, డేవిస్ ఫాల్స్(జలపాతాన్ని) సందర్శించారు. అయోధ్యలోని శ్రీరామ మందిరాన్ని కూడా దర్శించుకున్నారు. అందరూ ఒక బృందంగా నిలిచి, ఎన్నో క్షేత్రాలను చూసి, మరెన్నో మధురజ్ఞాపకాలతో తిరిగి నెల్లూరుకి చేరుకున్నారు.

ఎక్కడో వెంకటాచలంలోని మారుమూల గ్రామీణ వాతావరణంలో ఉన్న పాఠశాల నుండి విదేశీ విహార విజ్ఞానా యాత్రకు విద్యార్థులను, వారి సిబ్బందిని..తన అనారోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా ఎంతో శ్రమతో, వ్యయ ప్రయాసలకు ఓర్చి పంపడమే కాక, స్వీయ పర్యవేక్షణతో విద్యార్థులకు ఆనందాన్ని, మధుర జ్ఞాపకాలను కలగచేసిన స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, అక్షర విద్యాలయ కరెస్పాండెంట్ దీపమ్మ అభినందనీయురాలు.

గతంలో కూడా విద్యా పర్యటనలలో భాగంగా ముస్సోరీ (అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ ట్రైనింగ్ అకాడమీ)ని, డెహ్రాడూన్ (డిఫెన్స్ ట్రైనింగ్ అకాడమీ)ని, వాఘా సరిహద్దు ప్రాంతాన్నీ, అమృత్‌సర్‌ను, న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవనం, రాష్ట్రపతి భవన్ వగైరాలను, ఆ తర్వాత శిల్పకళకు కాణాచిగా నిలిచిన మహాబలిపురంతో పాటు, పాండిచ్చేరి, బెంగళూరు, మైసూరు, కోల్‌కతా తదితర ప్రాంతాలన్నిటినీ అక్షర విద్యార్థినీవిద్యార్థులు సందర్శించి రావడం గమనార్హం.

లాయర్
నవంబర్ 03, 2023

# రైలు ప్రయాణీకుల భద్రత.. గాలిలో దీపం కాకూడదు

మనదేశంలో రైలు ప్రయాణాలు తలచుకుంటేనే భయం గొలిపే విధంగా ఉంటున్నాయి. రైలు ప్రయాణాల్లో భద్రత కొరవడింది. భారతీయ రైల్వేల పనితీరు అధ్వాన్నంగా తయారవుతోంది. ఎక్కడ-ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయపడేంతగా జరుగుతున్న రైలు ప్రమాదాలు ప్రయాణీకులను హడలెత్తిస్తున్నాయి. భారతీయ రైల్వేలు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉంటూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బుల్లెట్ వేగంతో దూసుకుపోతున్న వేళ, వందేభారత్ వంటి అత్యంత వేగవంతమైన రైళ్ళతో మన రైల్వే వ్యవస్థ మునుపటి కంటే కూడా ముందడుగు వేస్తున్న తరుణాన.. ఇలాంటి ప్రమాదాలు జరగడం విచారకరం. ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలోను, భద్రతా చర్యలు మరింత పకడ్బందీగా ఉండడంలోనూ, ముఖ్యంగా సిగ్నలింగ్ వ్యవస్థను అనుసరించే విధానాల్లోనూ ఉన్న లోపాల వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని సర్వత్రా వినిపిస్తోంది. అందువల్ల అటు ప్రమాదాలు పెరగడం, ప్రమాదాల్లో మృతుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతుండడం జరుగుతోంది. గత జూన్‌లో ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లాలో సూపర్‌ఫాస్ట్ రైళ్లు ఒకదానికొకటి ఢీకొనడం, గూడ్సురైలు కూడా వచ్చి వాటిని గుద్దుకోవడంతో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 296 మంది ప్రాణాలు కోల్పోవడం దేశప్రజలను ఒకపక్క కలచివేస్తుంటే, మళ్లీ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరంజిల్లాలో జరిగిన రైలు ప్రమాదం ప్రయాణీలను మరింత భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఈ దుర్ఘటనలో 13 మంది మృతిచెందారు. మరో 30 మందికిపైగానే గాయాలపాలయ్యారు. గాయపడ్డ వారి సంఖ్య మరింత హెచ్చుగా ఉండవచ్చు కూడా.

విశాఖ నుంచి పలాస వెళ్ళే ప్యాసింజరు రైలు కొత్తవలస రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి భీమాళి రైల్వేస్టేషన్ దాటిన తర్వాత ఆలమండ రైల్వేస్టేషన్ నుంచి సిగ్నల్ రాకపోవడంతో డ్రైవర్ రైలును నిలిపివేయడం, అదే సమయంలో రాయఘడ ప్యాసింజర్ రైలు అదే ట్రాక్‌పై ముందు వెళ్తున్న పలాస రైలును వెనుకనుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. దీంతో పలాస ప్యాసింజర్ వెనుకనున్న రెండు బోగీలు, వాటిని ఢీకొట్టిన రాయఘడ రైలు ఇంజన్‌తో పాటు, మరో మూడు బోగీలు పలాస రైలుమీద పడి తునాతునకలైపోయాయి. కొన్ని బోగీలు పక్క ట్రాక్‌పై ఉన్న గూడ్స్‌రైలు మీద కూడా పడ్డాయి. దీంతో పెను ప్రమాదం చోటు చేసుకుంది. మృతుల్లో ఒక లోకో పైలట్ కూడా ఉన్నారు. ప్రమాద సమయంలో ప్రయాణీకుల హాహాకారాలు మిన్నంటాయి. అరుపులు, ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా భీభత్సంగా మారింది. సిగ్నలింగ్ వ్యవస్థలో లోపమా?..లేదా మరేదైనా కారణమా?.. అన్నది పూర్తిస్థాయిలో ఇంకా తేలలేదు. మొత్తమ్మీద మానవ తప్పిదం వల్లనే ఈ దుర్ఘటన జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వేగ పరిమితిని పాటించకపోవడం వల్లనే ప్రమాదం జరిగివుంటుందనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి. ఏదేమైనా ఈ దుర్ఘటనతో మృతుల కుటుంబాలు, బాధితుల గోడు వర్ణనాతీతం. ప్రపంచంలోనే అతిపెద్దదైన భారతీయ రైల్వే వ్యవస్థ మరింత పటిష్టంగా రూపొందాలి. నిత్యం లక్షలాది మంది ప్రయాణీకులను గమ్యాలకు చేర్చే రైళ్లు ఏమాత్రం పట్టు తప్పినా పట్టాల్లో నెత్తురుటేరులు పారుతాయి. చనిపోయాక ఎంత ఎక్స్‌గ్రేషియా ఇచ్చినా మృతుల కుటుంబాలకు తగిలిన గాయాలను ఎవరు మాన్పగలరు?.. ఇకనైనా భద్రతా ప్రమాణాలను పెంపొందించాలి. సాంకేతికపరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా రైళ్ళు ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేలా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేసుకోవాలి. అమెరికా, చైనా, జపాన్, హాంకాంగ్, సింగపూర్ వంటి దేశాల్లో బుల్లెట్ రైళ్ళు సైతం ఎలాంటి ప్రమాదాలు లేకుండా సజావుగా నడుస్తున్నాయంటే వారు ఆ వ్యవస్థపై చూపే శ్రద్ధ అలాంటిది. మనదేశంలో ఇంకా అంతటి పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడం, ముఖ్యంగా రైల్వేశాఖలో లక్షలాదిగా ఉన్న ఖాళీ పోస్టులు ఇంకా భర్తీ కాకపోవడం వంటివన్నీ పెద్ద సమస్యలే. అలాంటి ఇబ్బందులన్నీ పోవాలి. అందుకు, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న అత్యున్నతస్థాయి శిక్షణ గల సిబ్బంది అవసరం. దాంతో పాటు, మన రైళ్ళలో ప్రయాణీకులకు అంతంత మాత్రంగానే ఉన్న సదుపాయాలను మరింతగా పెంచాలి. ఇకనైనా ఇలాంటి సమస్యలన్నిటినీ అధిగమించేందుకు ప్రభుత్వాలు, రైల్వే ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. ఏదేమైనా, రైలు ప్రయాణీకుల భద్రత గాలిలో దీపం కాకూడదు. భారతీయ రైల్వేలంటే ప్రపంచానికే గర్వకారణం అన్నట్లుగా తయారుకావాలి. అందుకు ముందుగా రైళ్ళలో ప్రమాదరహిత ప్రయాణాలను సాకారం చేసుకోవాలి.

## చెక్‌డ్యామ్‌ల సంగతే మరచిపోయారా?..

దాహమైనప్పుడు బావి తవ్వుకునే అనాలోచిత విధానాలను మనవాళ్లు అనుసరిస్తున్నారే తప్ప, ముందు జాగ్రత్తగా ఆలోచించడం, ప్రజలకు అవసరమైనవేళ వారిని ఆదుకోవడం వంటి చర్యలపట్ల అశ్రద్ధ వహిస్తుండడం విచారకరం. జిల్లాలో వానల్లేవు.. సాగునీళ్ళు లేవు కాబట్టి సేద్యం ఈ సీజన్‌లో మానుకోమంటున్నారే తప్ప, ముందుగా తగు ప్రణాళికలతో ఉంటే ఈ ఇబ్బందులు ఉండేవి కాదు కదా!..పంటల అవసరాలకు కొరతలేకుండా సాగునీళ్ళు ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవడం పట్ల అటు ప్రభుత్వం కానీ, ఇటు జిల్లా అధికారులు కానీ ఎందుకు శ్రద్ధ వహించడం లేదు?.. వానలు వరదలు వచ్చినప్పుడు వృధాగా నీళ్లన్నీ సముద్రం పాలవుతూనే ఉంటాయి. అలా నీళ్ళొచ్చినప్పుడు చెరువులు, దొరువులు నింపుకోవడం, ప్రతి గ్రామంలోనూ ఎక్కడ అవసరమైతే అక్కడ చెక్‌డ్యామ్‌లు ఏర్పాటుచేసి ముందుగానే నీళ్లు నిల్వచేసుకోవడం వంటి ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయి కదా!..చెక్‌డ్యామ్‌ల వల్ల భూగర్భ జలాల నీటిమట్టం కూడా పెరుగుతుందని అధికారులే చెప్తుంటారు కానీ, ఆచరణలో మాత్రం వాటి నిర్మాణాల సంగతి మరచిపోయినట్లుంది. ఇకనైనా, వానలు లేని రోజుల్లో కూడా రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీటిని అందించే మార్గాలపై దృష్టిపెట్టాలని విజ్ఞప్తి.

కెవై ప్రకాశ్, మర్రిపాడు.

## మురుగులో మగ్గుతున్న మనుమసిద్ధినగర్

నెల్లూరులోని మనుమసిద్ధినగర్‌ను ఒకసారి అధికారులు దర్శించాలి. ఇక్కడున్న అనేక ఖాళీస్థలాల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి మురుగుగబ్బు భరించలేక ప్రజలు నరకయాతన పడుతున్నారు. నెలల తరబడి ఈ గబ్బును భరించాల్సివస్తోంది. వాటివల్ల ఈగలు, దోమలు, లేనిపోని రోగాలు. ఖాళీస్థలాలు శుభ్రంగా ఉంచుకోవాలని నగర పాలక సంస్థ వారు ఎన్నిసార్లు చెప్తున్నా పట్టించుకునేవారు లేరు. నగరంలోని ఖాళీ స్థలాలన్నిటినీ ఒకసారి నగరపాలకసంస్థ వారు పరిశీలించి వాటిని శుభ్రంగా పెట్టుకోవాలని వాటి సొంతదారులకు గట్టిగా చెప్పడం అవసరం.

– ఏ. నారాయణ, నెల్లూరు.




## కొండ్లపూడి చెరువు గుల్లగుల్ల!

జిల్లాలో ప్రకృతి విధ్వంసం యధేచ్ఛగా సాగిపోతోంది. మట్టిమాఫియాకు అడ్డూ అదుపూ ఉండడం లేదు. ఇటీవల నెల్లూరు రూరల్‌లోని కొండ్లపూడి చెరువును అక్రమార్కులు కొందరు ఇష్టంవచ్చినట్లు తవ్వేసి మట్టిని అమ్ముకుతింటున్నా పట్టించుకునే వారు లేరు. రేయింబవళ్లూ మట్టిని తవ్వడం అమ్ముకోవడం ఇదే పనైపోయింది. అధికారులకు, నాయకులకు అందరికీ తెలిసే ఈ దోపిడీ సాగిపోతోంది. ఇక అడ్డుకునేదెవరు?..ఒక్క కొండ్లపూడి అనేకాదు, జిల్లాలో చెరువులు దొరువుల్లో అంతా ఇదే తంతు. మనిషిలోతు గుంటలు తవ్వి మట్టినంతా లోడుకుపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులైనా పట్టించుకోకపోతే ఎలా?...

– శివశంకరయ్య, నెల్లూరు రూరల్.




## రాజధానితో 'రాజసం' రావాలి... రాక్షసత్వం కాదు!

ఉమ్మడి రాష్ట్రం నుండి తెలంగాణ విడిపోయి అనాధాంధ్రగా కొత్త రాష్ట్రం ఏర్పడి మరో ఆరు నెలలకి పది సంవత్సరాలు పూర్తవుతుంది. రెండు రాష్ట్రాలకి రాజధానిగా పదేళ్లు హైదరాబాదే ఉంటుందని, విభజన సమయంలో ప్రకటించిన గడువు కూడా ఆరు నెలల్లో పూర్తైపోతుంది. ఓటుకు నోటు కేసులో ఇరుక్కుని తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు దెబ్బకి భయపడి ఆంధ్రా ముఖ్యమంత్రి చంద్రబాబు అక్కడినుండి పారిపోయి రాష్ట్రానికి వచ్చేశారు. తనను తాను చాలా మేధావిగా చెప్పుకునే బాబు రాజధాని విషయంలో తప్పులో కాలేశారు. తన సామాజికవర్గం ఒత్తిడికి తలొగ్గి విజయవాడకి సమీపంలో అమరావతిని రాజధానిగా ప్రకటించారు.

వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో చంద్రబాబుని టార్గెట్ చేసే క్రమంలో ఆ పార్టీ ఆరోపణలు మొత్తం రాజధాని చుట్టూనే తిరిగాయి. రాజధాని పేరుతో కేంద్రం నుండి వేల కోట్లు తెచ్చి దోచేశారన్నది మొదటి ఆరోపణ. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌తో తెలుగు తమ్ముళ్లు, బాబు సామాజికవర్గ ప్రముఖులూ రాజధాని చుట్టూ వేల ఎకరాల భూములు కొనుగోళ్లు చేసి కోట్లకి పడగలెత్తారన్నది రెండవ ఆరోపణ. ఇన్నర్ రింగురోడ్డుని తమ ఇష్టానుసారం దారి మళ్లించి అవినీతికి పాల్పడ్డారన్నది మూడో ఆరోపణ. ఇలా అనేక ఆరోపణలతో అప్పట్లో మునిసిపల్ శాఖ మంత్రిగా ఉన్న నారాయణ మొదలు, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వీ.రమణతో సహా ఎవరినీ వదలకుండా ఆరోపణల బాణాలు సంధించింది వైసీపీ దళం. రమణ విషయంలో అయితే ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రే స్వయంగా కేంద్రానికి లేఖ రాశారు. ఆయనని దేశ అత్యున్నత న్యాయస్థానానికి ప్రధాన న్యాయమూర్తిగా నియమించవద్దంటూ ఆయన నియామకాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇదే కోణంలో మూడు రాజధానులు అన్న కొత్త నినాదాన్ని తెరపైకి తెచ్చి బాబుని, బాబు సామాజికవర్గాన్ని ఆర్థికంగా చావుదెబ్బ కొట్టే వ్యూహాన్ని వైసీపీ రచించింది. అనుకున్నదే తడవు అసెంబ్లీ సాక్షిగా తన ఆలోచనని బయటపెట్టి, విశాఖని ప్రభుత్వ పరిపాలనా రాజధానిగా, అమరావతిని శాసన రాజధానిగా, కర్నూలుని న్యాయ రాజధానిగా చేయబోతున్నట్లు ప్రకటించేసింది.

అంతా బాగానే ఉంది. కారణం ఏదైనా, మూడు రాజధానులు ఏర్పాటు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను, ఇతర దేశాలలో ఇలా ఒక ప్రాంతానికి మూడు రాజధానులు ఉన్నందువల్ల వొనగూరిన లాభాలను ప్రజలకి వివరించడంలో వైసీపీ సఫలమయ్యిందనే చెప్పొచ్చు.

తమ ప్రాంతానికి పరిపాలనా రాజధాని వస్తుందంటే ఎవరైనా సంబరపడతారు. పొంగిపోతారు. తమ జీవితాలు మారిపోతాయని ఆశపడతారు. ప్రభుత్వ కార్యాలయాలు తమ ప్రాంతానికి వస్తే లక్షలాది మంది ఉద్యోగులు వస్తారు. వారికి అవసరమైన నివాస సముదాయాలను ఏర్పాటు చేయడంలో రియల్ ఎస్టేట్ ధరలు పెరిగిపోతాయి. తమ భూములకు ధరలు వస్తాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో తమ పనులు చక్క పెట్టుకోవడానికి రోజూ కొన్ని వేలమంది తమ ప్రాంతానికి వస్తారు. వారికి కావాల్సిన వసతి భవనాలు, ఆతిథ్య కూడళ్లు, షాపింగులు, వినోదాలు, విలాసాలు... ఇలా ఒకటి రెండు అని కాకుండా అన్ని రంగాలూ అభివృద్ధి చెందుతాయి. రవాణా సౌకర్యం కూడా పెరుగుతుంది. పరిశ్రమలు వస్తాయి. అంతర్జాతీయ ఐటీ సంస్థలు వస్తాయి. మౌలిక వసతులు అభివృద్ధి చెందుతాయి. జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు తమ ప్రాంతాన్ని సందర్శిస్తారు. ఒక్కసారిగా తమ ప్రాంతం తీరూ, తెన్నూ మారిపోతాయి. తమ బిడ్డల బంగారు భవిష్యత్తు తమ కళ్ళముందు కనపడుతుంది. మరి అలాంటప్పుడు విశాఖ పరిసర ప్రాంత వాసులు రాజధాని వస్తుందంటే ఎందుకు ఆసక్తి చూపడంలేదు..? ఎందుకు స్వాగతించడం లేదు..?? ఎందుకు సహకరించడం లేదు...??? అంటే ఒక్కటే సమాధానం వినిపిస్తోంది.

"భయం"... రాజధాని వస్తోందంటే మాకు భయమేస్తోందని విశాఖ పరిసర ప్రాంత వాసులు ముక్తకంఠంతో చెప్తున్నారు. భయమా...! ఎందుకు ..? అని ప్రశ్నిస్తే వాళ్ళు చెప్పే సమాధానం వింటే ఎవరికైనా దిమ్మ తిరగాల్సిందే...!

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖ ఇన్‌ఛార్జిగా ఆ పార్టీలోని ఒక కీలక వ్యక్తి తమ ప్రాంతానికి వచ్చాడని అంటూ.... ఆయన మా సాయి చూసినప్పటి నుండి మా బ్రతుకులు బిక్కుబిక్కుమంటూ సాగుతున్నాయని వాపోతున్నారు విశాఖ వాసులు. ఆ ఒక్క వ్యక్తి కనుసన్నలలోనే భూ కబ్జాలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలు, బెదిరింపుల, అక్రమ కేసుల పర్వంతో హడలిపోయామని లబోదిబోమంటున్నారు. మా స్థలాలు మేము అమ్ముకోవాలన్నా, ఇంకొకరి స్థలం మేము కొనుక్కోవాలన్నా ఆయన అనుమతి తీసుకోవాలన్న నిబంధన అధికారులే విధించడం విడ్డూరమనిపించిందని అంటున్నారు. ఇలా ఒక్క వ్యక్తి తమ సాయి చూస్తేనే తమ బ్రతుకులు బజారు పాలవబోతున్నాయనే భ్రమ కలిగిందని, అలాంటిది ఏకంగా రాజధానే విశాఖకి వస్తే అలాంటి వాళ్ళు ఇంకెంత మంది వచ్చి మా బ్రతుకులతో ఆడుకుని, మాపైన సవారి చేసి, మా హక్కులని కాలరాసి మమ్మల్ని మా ప్రాంతంనుండి తరిమేస్తారోనన్న భయం మా విశాఖపట్నం ప్రజలలో ఏర్పడిందని అక్కడివాళ్ళు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు.

రాజధాని వస్తే తమ ఊరుకి 'రాజసం' వస్తే పరవాలేదు, కానీ రాక్షసత్వం వస్తుందేమో అని గడగడలాడుతున్నాం అంటున్నారక్కడి సామాన్య ప్రజలు. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో, అక్కడకి ఇన్‌ఛార్జిగా వెళ్లి కొన్నాళ్ళు వారి సాయి చూసిన ఆ వ్యక్తి ప్రభావం వారిపై ఎంతగా పడిపోయిందో మనం ఊహించుకోవచ్చు.

పరిపాలనా రాజధానిని విశాఖకి మార్చేముందు అక్కడివారి భయాన్ని పోగొట్టవలసిన బాధ్యత ఇప్పుడు వైసీపీ పైన ఉంది. గతంలో జరిగిన పరిణామాలు పునరావృతం కావని సీఎం జగనే స్వయంగా ప్రకటించి ఆ ప్రాంతవాసులకి భరోసా కల్పించాలి. రాజధాని వస్తే 'రాజసం' వస్తుంది తప్ప, 'రాక్షసత్వం' కాదన్న నమ్మకం వారిలో కలిగేలా వారిని చైతన్యవంతుల్ని చేయాలి..!

- రాజశ్రీ



# రెడ్‌క్రాస్‌లో డయాగ్నొస్టిక్ సెంటర్

రక్తపరీక్షల పేరుతో ప్రైవేటు ఆసుపత్రులు వేలకువేలు గుంజుతున్న నేపథ్యంలో నెల్లూరు రెడ్‌క్రాస్ వారు అత్యంత తక్కువ ధరకే పేదలకు రక్తపరీక్షలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ ప్రాంగణంలో కొత్తగా నెలకొల్పిన వైఆర్‌జీ కేర్ డయాగ్నొస్టిక్ సెంటర్‌కు రెడ్‌క్రాస్ ఛైర్మెన్, శాసనమండలి సభ్యుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల ప్రారంభోత్సవం చేశారు. రెడ్‌క్రాస్ ద్వారా పేద రోగులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తొలుత, రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు సర్ జీన్ హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మెన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, శ్రీహరిరెడ్డి, కన్వీనర్లు లోకేష్, మురళీకృష్ణ, సాయిరాం, కో-కన్వీనర్ ఎన్ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోటరీక్లబ్ ఆధ్వర్యంలో.. పోలియో పట్ల అవగాహన



ప్రపంచ పోలియో దినాన్ని పురస్కరించుకుని అక్టోబరు 27న నెల్లూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పోలియో మహమ్మారి వ్యాధి పట్ల అవగాహన సదస్సు జరిగింది. పోలియో వస్తే కలిగే బాధలను, దాని వల్ల వచ్చే దుష్ఫలితాలను, ఆ వ్యాధిని నివారించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రోటరీక్లబ్ ప్రతినిధులు వివరించారు. పోలియో నివారణలో రోటరీ ఇంటర్నేషనల్ సేవాసంస్థ సేవలు ప్రశంసనీయమని వారు కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లాలోని 5 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, ఆ పోటీల్లో విజేతలను ఎంపికచేసి వారికి నెల్లూరులోని రోటరీ ఆడిటోరియంలో ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రోటరీక్లబ్ అధ్యక్షుడు ఎం.డి సమీవుల్లా, పీడీజీ దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

# అమరజీవికి.. కెవి చలమయ్య నివాళి



ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా నవంబరు 1న నెల్లూరులోని అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి అంతర్జాతీయ ఆర్యవైశ్య సమాఖ్య అధ్యక్షులు కెవి చలమయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగనిరతితోనే ఆంధ్రరాష్ట్రం అవతరించిందని, అలాంటి మహనీయునికి 'భారతరత్న' ఇవ్వాలని, వారి కాంశ్య విగ్రహాన్ని రాష్ట్ర శాసనసభలో ఏర్పాటుచేయాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు నగరకంటి రవీంద్రనాథ్, ఆర్‌వి శరత్, ఎస్.నాగేశ్వరరావు, రాయవరపు రామకృష్ణ, సోమిశెట్టి వెంకటరత్నం, అవోపా సభ్యులు, ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్ సభ్యులు పాల్గొన్నారు.

# బదిలీలు-ప్రమోషన్లు

జిల్లాలో పలువురు తహశీల్దార్లను బదిలీ చేస్తూ, ముగ్గురు ఎంపీడీఓలకు ఉద్యోగోన్నతి (ప్రమోషన్) కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులిచ్చింది. అనుమసముద్రం పేట (ఏఎస్‌పేట) తహశీల్దార్ ఏ.వెంకటరమణారావును జలదంకికి బదిలీ చేశారు. విడవలూరు తహశీల్దారు హమీద్ సెలవుపై వెళ్ళడంతో కొడవలూరు తహశీల్దార్ రమాదేవిని ఆ స్థానంలో ఇన్‌చార్జిగా నియమించారు. దుత్తలూరు డెప్యూటి తహశీల్దార్ నరేష్‌ను వెంకటాచలంకు బదిలీ చేస్తూ ఆదేశాలిచ్చారు. అదేవిధంగా, జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఎంపీడీఓలకు డీఎల్‌డిఓలు (డివిజనల్ లెవల్ డెవలప్ మెంట్ ఆఫీసర్లు)గా ఉద్యోగోన్నతి కల్పించారు. వెంకటాచలం మండలం ఎంపీడీఓగా ఉన్న సుస్మితకు డిఎల్‌డీఓగా పదోన్నతి కల్పించి, జిల్లా పంచాయతీ అధికారిగా కొనసాగిస్తూ ఉత్తర్వులిచ్చారు. తోటపల్లిగూడూరు ఎంపీడీఓ హేమలతను నుడా అకౌంట్స్ అధికారిగా, దుత్తలూరు ఎంపీడీఓ నిర్మలాదేవిని డిఎల్‌డీఓగా ఉద్యోగోన్నతి కల్పించి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించారు. దీంతో ఖాళీ అయిన మండలాలకు ఎంపీడీఓలను ఇన్‌చార్జిలుగా నియమిస్తూ బాధ్యతలు అప్పగించారు. వెంకటాచలం మండలం ఎంపీడీఓ కార్యాలయం ఏఓగా పనిచేస్తున్న ముజుంబున్నిసాబేగంకు ఇన్‌చార్జి ఎంపీడీఓ బాధ్యతలను కేటాయించారు. తోటపల్లిగూడూరు మండలం ఎంపీడీఓ ఇన్‌చార్జి బాధ్యతలను ఈఓపీఆర్డీ ఎం.సాయిప్రసాద్‌కు, ముత్తుకూరు ఇన్‌చార్జి బాధ్యతలను ఏఓ లక్ష్మణ్‌కుమార్‌కు అప్పగిస్తూ జడ్పీ సిఇఓ చిరంజీవి ఆదేశాలిచ్చారు.

# జన్మభూమికి సతీష్‌రెడ్డి సేవలు

## చెన్నై, శంకర నేత్రవైద్యాలయం వారిచే మహిమలూరులో నేత్రవైద్యశిబిరం




*మహిమలూరు అంటే సతీష్‌రెడ్డికి ప్రాణం. సతీష్‌రెడ్డి అంటే ఆ గ్రామానికెంతో అభిమానం. సొంతవూరైన మహిమలూరు పట్ల అభిమానం ఉండడమే కాక, తానెంత ఉన్నతస్థాయిలో ఉన్నా..'జననీ జన్మభూమిశ్చ'..అన్నట్లు, పుట్టిన ఊరును మరచిపోకుండా, ఆ గ్రామ ప్రజలకు తనవంతు సేవలందిస్తూ అందరికీ మార్గదర్శకమవుతున్నారు మన సతీష్‌రెడ్డి. చెన్నై, శంకర నేత్ర వైద్యాలయం వారి సహకారంతో మహిమలూరులో ఇటీవల పెద్దఎత్తున నేత్ర వైద్యశిబిరం ఏర్పాటుచేయించి ప్రజలకు ఉచితంగా నేత్రపరీక్షలు, అవసరమైన చికిత్సలు చేయిస్తున్నారు.*



ప్రఖ్యాత శాస్త్రవేత్తగా పేరొంది, అపూర్వమైన సాంకేతిక పరిజ్ఞానంతో గతంలో డిఆర్‌డీఓ ఛైర్మెన్‌గా.. భారత రక్షణ మంత్రిత్వ శాఖ సాంకేతిక సలహాదారుగా దేశానికి గర్వకారణమైన సేవలందించిన మన జిల్లా వాసి గుండ్రా సతీష్‌రెడ్డి ఇటీవల స్వస్థలమైన మహిమలూరుకు వచ్చి, చెన్నై శంకర నేత్ర వైద్యాలయం వారి అత్యున్నతమైన సేవలను గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అక్టోబరు 29న ప్రారంభమైన ఈ వైద్య శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి కంటి పరీక్షలు చేయించుకుంటున్నారు. నవంబరు 4వ తేదీ వరకు ఈ వైద్యశిబిరం జరుగనుంది.

### జన్మభూమి సేవ అదృష్టం :

**- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి**

తొలిరోజున ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ డా.కె. తిరుమలేశ్వర రెడ్డి మాట్లాడుతూ, సతీష్‌రెడ్డి చేస్తున్న మానవీయ సేవలను అభినందించారు. కన్నతల్లికి, జన్మభూమికి సేవ చేయడం ఒక గొప్ప అదృష్టమని, ప్రఖ్యాత శాస్త్రవేత్తగా పేరొందిన సతీష్‌రెడ్డి తన పుట్టిన ఊరైన మహిమలూరు గ్రామానికి ఎనలేని సేవలు చేస్తుండడం సంతోషకరమని, ఆయన సేవలు అందరికీ మార్గదర్శకమని కొనియాడారు. వారం రోజులపాటు జరిగే ఈ నేత్ర వైద్య శిబిరంలో ప్రతిరోజు పాల్గొంటున్న సుమారు 300మందికి "అన్నదాత"గా ప్రసిద్ధి చెందిన సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర్ రెడ్డి అన్నవితరణ గావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శంకర నేత్రాలయం నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ అరుళ్‌కుమార్, సతీష్‌రెడ్డి సోదరుడు శ్రీనివాసులురెడ్డి, బీజేపీ నాయకుడు కుడుముల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సేవతోనే సంతృప్తి - సతీష్‌రెడ్డి

ప్రజలకు అవసరమైన సేవలందించగలిగినప్పుడే అసలైన సంతృప్తి ఉంటుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న సతీష్‌రెడ్డి చెప్పారు. శంకర వైద్యాలయం వారు చేసే కంటి ఆపరేషన్లు నూటికి నూరుశాతం మంచి ఫలితాలిస్తున్నాయని, అలాంటి వైద్యాలయం వారు మహిమలూరులో రెండవసారి ఈ వైద్యశిబిరం నిర్వహించడం సంతోషకరమని అంటూ, వారంరోజుల పాటు నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ఆత్మకూరు, మర్రిపాడు, అనంతసాగరం తదితర మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తాను పుట్టిన ఊరైన మహిమలూరు గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూనే ఉంటానని ఆయన చెప్పారు.

# రౌడీమూకల భరతం పట్టండి

## - బీజేపీ నేత కందుకూరి



కావలిలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఇటీవల కొందరు రౌడీలు అమానుషమైన దాడికి పాల్పడడం ప్రజలను కలచివేస్తోందని, ఇకనైనా ప్రభుత్వం రౌడీమూకల భరతం పట్టాలని బీజేపీ నేత కందుకూరి సత్యనారాయణ కోరారు. మంగళవారం ఆయన కావలిలో విలేకర్లతో మాట్లాడుతూ, పోలీసులు రౌడీల పీచమణిస్తే తప్ప ప్రజలకు సుఖశాంతులు ఉండవని, శాంతి భద్రతలపై ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఇలాంటి అకృత్యాలను అణచివేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు కంచర్ల మురళీనాయుడు, కె.బ్రహ్మానందం, కమల, సత్యం, కిరణ్, ప్రసన్న, తిరుపతి స్వామి పాల్గొన్నారు.

# వన్యప్రాణుల వేటను అరికట్టాలి

## - అటవీశాఖ ఇన్‌చార్జి చీఫ్ కన్జర్వేటర్ శ్రీనివాసులురెడ్డి



జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల వేటను వెంటనే అరికట్టాలని, మూగజీవాలను సంరక్షించాలని, అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షించాలని అటవీశాఖ ఇన్‌చార్జి చీఫ్ కన్జర్వేటర్ వై. శ్రీనివాసులురెడ్డి (గుంటూరు) జిల్లాలోని ఫారెస్ట్ రేంజర్లను ఆదేశించారు. మంగళవారం ఆయన నెల్లూరులోని అటవీశాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశమై సిబ్బందికి తగు సూచనలిచ్చారు. వర్షాభావంతో వన్యప్రాణులు నీటికోసం ఇబ్బందులు పడకుండా అటవీ ప్రాంతాల్లో నీటివసతులను ఏర్పాటుచేయాలని చెప్పారు. అడవుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నగరవనాలను అభివృద్ధి చేయాలని, నెల్లూరు నగరవనాన్ని వీలైనంత త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, వెంకటాచలం, నరసింహకొండ ప్రాంతాల్లో కూడా నగరవనాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరుచేసిందని చెప్పారు. అటవీ భూముల్లో ఎక్కడా అక్రమ మైనింగ్ జరగకుండా నిరంతరం నిఘా ఉంచాలన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్, అటవీశాఖ రేంజర్లు పాల్గొన్నారు.

# ఇద్దరు తహశీల్దార్లు.. డెప్యూటీ కలెక్టర్లయ్యారు

ఉభయ నెల్లూరు జిల్లాలకు చెందిన ఇద్దరు తహశీల్దార్లు డెప్యూటీ కలెక్టర్లయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం తాజాగా ఇచ్చిన ఉద్యోగోన్నతుల్లో నెల్లూరులోని నుడా (నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)లో పనిచేస్తున్న తలమంచి వెంకటసునీల్, గూడూరు తహశీల్దారు లీలారాణిలు కూడా డెప్యూటీ కలెక్టర్ల జాబితాలో ఉన్నారు. వారిరువురికీ సహ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

# నెల్లూరు కబుర్లు



## శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న.. డా. సతీష్‌రెడ్డి

నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని ప్రఖ్యాత శాస్త్రవేత్త, డిఆర్‌డిఓ మాజీ ఛైర్మెన్, భారత రక్షణ మంత్రిత్వశాఖ పూర్వ సాంకేతిక సలహాదారు డా.గుండ్రా సతీష్‌రెడ్డి అక్టోబరు 29న దర్శించుకున్నారు. ఆలయ ఇఓ శ్రీనివాసులురెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్ తదితరులు ఆయన్ను సాదరంగా స్వాగతించి అమ్మవారి సన్నిధిలో పూజలు చేయించారు.

## యోగాలో మెరికలు.. నెల్లూరీయులు

○ పలువురికి బంగారు పతకాలు




యోగాలో నెల్లూరీయులు మెరికలనిపించారు. తమిళనాడులో ఇటీవల జరిగిన జాతీయస్థాయి యోగా పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు తమ సత్తా చాటుకుంటూ పతకాలు సాధించారు. పతకాల విజేతలను అక్టోబరు 30న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో డిఎస్‌ఏ చీఫ్ కోచ్ ఆర్‌కె యతిరాజ్ తదితరులు అభినందించారు. జాతీయ యోగా పోటీలు అండర్ 15-18 విభాగంలో ఏ.దివ్య రజత పతకాన్ని, అండర్ 25-35 విభాగంలో అనిత రజత పతకాన్ని సాధించగా, అండర్ 35-50 విభాగంలో కె. కావ్యశ్రీ, ఏ. శ్రీనివాసులు బంగారు పతకాలు కైవశం చేసుకున్నారని ఆయన కొనియాడారు. ఈ విభాగంలో జె. రాజేంద్రకుమార్ కాంశ్య పతకం సాధించాడని తెలిపారు. 50 ఏళ్ళ పైబడిన విభాగంలో పి.ప్రసన్న, రఘురామయ్య బంగారుపతకాలు సాధించారని, యోగా కోచ్ ప్రసన్న ఈ సందర్భంగా లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు కూడా అందుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన జిల్లా ఎస్పీ



పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని పీఎంపి అసోసియేషన్ సహకారంతో అక్టోబరు 28న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లోఉచిత మెగా వైద్యశిబిరం, రెడ్‌క్రాస్ సాయంతో రక్తదాన శిబిరం ఏర్పాటు కాగా, జిల్లా ఎస్పీ డా. కె.తిరుమలేశ్వరరెడ్డి కూడా రక్తదానం చేసి పోలీసుల్లో స్ఫూర్తిని నింపారు. రక్తదానమంటే ప్రాణదానమని, దీనిపై ఎవరూ అపోహలు పెట్టుకోవద్దని ఎస్పీ తెలిపారు. ఈ శిబిరంలో ఎస్పీతో పాటు అనేకమంది రక్తదానం చేయగా, వారందరినీ ఎస్పీ అభినందించారు. ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు వీరాంజనేయరెడ్డి, గాంధీ, చంద్రమోహన్, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## చంద్రగ్రహణంతో ఆలయాలు మూత



పాక్షిక చంద్రగ్రహణం కారణంగా అక్టోబరు 28వ తేది శనివారం సాయంత్రం ఆలయాలను మూసివేశారు. నగరంలోని శ్రీ రంగనాథస్వామి దేవస్థానం, శ్రీ మూలస్థానేశ్వరాలయం, శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయం, శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం తదితర ఆలయాలను మూసివేసి ఆదివారం ఉదయం సంప్రోక్షణ నిర్వహించాక తిరిగి తెరచి భక్తులకు దైవదర్శనం కల్పించారు.

• విఎస్‌యు అంతర్‌కళాశాలల క్రీడలు

## చెస్‌లో జెనెక్స్ ఫస్ట్

విక్రమసింహపురి యూనివర్సిటీ పరిధిలోని అంతర్‌కళాశాలల చెస్ పోటీల్లో నెల్లూరులోని జెనెక్స్ కళాశాల జట్టు ప్రథమస్థానంలో, కావలిలోని శ్రీచైతన్య కళాశాల జట్టు ద్వితీయస్థానంలో నిలిచాయి. అదేవిధంగా, కబడ్డీ పోటీల్లో చాంపియన్‌గా ఆత్మకూరులోని డా.ఎస్‌ఆర్‌జె డిగ్రీ కళాశాల జట్టు బహుమతినందుకుంది. ద్వితీయస్థానంలో కావలిలోని శ్రీసాయి కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఆత్మకూరులో ఈ పోటీలు జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ వరకుమారి, యూనివర్సిటీ అబ్జర్వర్ డా.ఆర్.మాల్యాద్రి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా విజేతలకు ట్రోఫీలను అందించి అభినందించారు.




## మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా చాటాలి

- రాష్ట్ర జట్టుకు ఆనం అరుణమ్మ అభినందన

మార్షల్ ఆర్ట్స్‌లో బాలబాలికలు సత్తా చాటాలని, గోవాలో నవంబరు 6 నుంచి 8వ తేది వరకు జరగనున్న జాతీయపోటీల్లో ప్రతిభతో రాణించి పతకాలు సాధించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆకాంక్షించారు. అక్టోబరు 29న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారుల శిక్షణా శిబిరంలో సాధన చేస్తున్న క్రీడాకారులను ఆమె అభినందించారు. రాష్ట్ర జట్టుకు శాప్ ఆధ్వర్యంలో నెల్లూరులో శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారికి క్రీడల కిట్‌లు పంపిణీ చేశారు.

## 20వ డివిజన్‌లో 'ఆరోగ్య సురక్ష'



నెల్లూరు రూరల్ పరిధిలోని 20వ డివిజన్‌లో స్టీల్ ఫ్యాక్టరీ సెంటర్‌లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. 300 మందికి పైగా ప్రజలకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. 20వ డివిజన్ నాయకులు తాళ్లూరి సురేష్ బాబు, రావు శ్రీనివాసరావు(ఆర్‌ఎస్‌ఆర్), అర్బన్ హెల్త్‌సెంటర్ ఇంఛార్జ్ వైద్యులు డాక్టర్ ఐశ్వర్య, దువ్వూరు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ క్యాలెండర్లు, డైరీలు వచ్చాయి

తిరుమల తిరుపతి దేవస్థానంవారు 2024 నూతన సంవత్సరానికి శ్రీ వేంకటేశ్వరస్వామి క్యాలెండర్లను సిద్ధంచేశారు. భక్తుల కోసం నెల్లూరులో కూడా వాటిని అందుబాటులో ఉంచుతూ, స్థానిక దర్గామిట్టలోని టీటీడీ కల్యాణమండపంలో విక్రయిస్తున్నారు. శ్రీవారి 12 పేజీల క్యాలెండర్ 130 రూపాయలు, డైరీ (డీలక్స్) రూ.150, టీపీ క్యాలెండర్ రూ.30, ఎస్వీ బిగ్ క్యాలెండర్ రూ.20, ఎస్‌వి అండ్ ఎస్‌పి క్యాలెండర్ రూ.15 వంతున అందుబాటులో ఉన్నాయని, భక్తులు వాటిని కొనుగోలు చేసుకోవచ్చని కల్యాణమండపం నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## 'తంగిరాల మహాభారతం' 79వ భాగం




విదురుడు సభనుద్దేశించి ద్రౌపది అడిగిన ప్రశ్నకు తగిన సమాధానం ఇవ్వమని కోరినప్పుడు ఎవరూ మాట్లాడరు. ద్రౌపది దుశ్శాసనుడు చేస్తున్న పరాభవాన్ని తట్టుకోలేక కౌరవవృద్ధులను, సభలో ఉన్నవారిని పదేపదే తాను దాసినో, కాదో చెప్పమని దీనంగా అడుగుతుంది. భీష్ముడు లేచి ఈ ధర్మసూక్ష్మాన్ని సమాధానము చెప్పగల సమర్థుడు ధర్మరాజు అని చెప్తాడు. భీముడు తన అధీశ్వరుడు ధర్మరాజు అని, అతడు అనుగ్రహిస్తే దుష్టకౌరవులను ఒక్కుమ్మడిగా సంహరించగలనని గర్జిస్తాడు. కర్ణుడు మళ్లీ ద్రౌపదిని అపహసించి నీవు దాసివని, ఇక ఎవరినైనా భర్తగా ఎంచుకోమని దుర్యోధనుణ్ణి చూపిస్తాడు. దుర్యోధనుడు తన ఎడమ తొడమీద కూర్చోవలసిందిగా ద్రౌపదికి సౌజ్ఞ చేస్తాడు. అదిచూసి భీమసేనుడు విపరీత క్రోధంతో గర్జించి తమ సామ్రాజ్యం, ఐశ్వర్యం మాయాజూదంలో అన్యాయంగా అపహరించి, మదించిన గర్వంతో ఇలా ద్రౌపదిని అవమానించిన దుష్ట దుర్యోధనుణ్ణి తన ప్రచండ గదా దండంతో యుద్ధరంగంలో అతని రెండు తొడలు విరగ్గొడతానని శపథం చేస్తాడు.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**




## దాడిచేసిన వారిని దండించండి

- కలెక్టర్‌కు ఎన్జీఓ నేతల వినతి




ఇటీవల బెంగుళూరు నుంచి విజయవాడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును కావలి వద్ద అడ్డగించి కొందరు దుండగులు బస్సు డ్రైవర్‌పై అమానుషంగా దాడిచేయడం దారుణమని ఏపీ ఎన్జీఓ సంఘం-నెల్లూరుజిల్లాశాఖ అధ్యక్ష కార్యదర్శులు మన్నేపల్లి పెంచలరావు, నాయుడు వెంకటస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దుండగులకు కఠినశిక్షలు పడేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ మంగళవారు వారు ప్రదర్శనగా వెళ్ళి జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బి. వెంకటేశ్వర్లు, ఆంజనేయవర్మ, జి.రామకృష్ణ, కరుణమ్మ, మధు, శ్రీధర్, కృష్ణకుమార్, చిన్నమ్మ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో ఐఏబి సమావేశం

జిల్లాలో సాగునీటి విడుదల విషయమై రైతుల అభ్యర్థన మేరకు తగు నిర్ణయం తీసుకునేందుకు వీలైనంత త్వరలో సాగునీటి సలహా మండలి (ఐఏబి) సమావేశం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. సోమవారం ఆయన నెల్లూరు కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సందర్భంలో పలువురు రైతులు పంటపొలాలకు సాగునీరందించాలని వినతిపత్రాలు సమర్పించారు. అందుకు స్పందించిన కలెక్టర్, ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి సలహామండలి త్వరలోనే తగు నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. జలాశయాల్లో నీరు తక్కువగా ఉంది కనుక, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సాగునీటి నిల్వలను అంచనా వేసుకుని ఏమేరకు నీరు విడుదల చేయవచ్చో పరిశీలించి సమగ్ర నివేదికను ఐఏబి ముందు ఉంచాలని ఈ సందర్భంగా కలెక్టర్ నీటిపారుదల ఎస్ఇ కృష్ణమోహన్‌ను ఆదేశించారు.

# సామాజిక న్యాయానికే.. సీఎం జగన్ ప్రాధాన్యత

## - సామాజిక సాధికార యాత్రలో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి





సామాజిక న్యాయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, రాష్ట్రంలోని పేద, బడుగు బలహీనవర్గాల వారి అభ్యున్నతికి సీఎం అమలుచేస్తున్న పథకాలు వారి జీవితాలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి (విపిఆర్) చెప్పారు. అక్టోబరు 30న ఉదయగిరి నియోజకవర్గంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్రలో ఆయన పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. భారతదేశంలో మరే రాష్ట్రం చేయలేని సాహసాన్ని మన ఆంధ్రా సీఎం వైఎస్ జగన్ చేసి చూపారని, మంత్రి పదవుల దగ్గరి నుంచి సంక్షేమ పథకాలు అందజేయడం వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకే ప్రాధాన్యతనిచ్చారని ఆయన తెలిపారు. 17 మంత్రి పదవులు, 29 ఎమ్మెల్సీలు, 4రాజ్యసభ సభ్యులు, 4 డెప్యూటీ సీఎం పదవులు, ఇంకా పలు జడ్పీ ఛైర్మన్లు, మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు, నామినేటెడ్ పోస్టులు వంటి అనేక పదవులను బడుగు బలహీనవర్గాల వారికి కేటాయించి సామాజిక న్యాయానికి ప్రాముఖ్యతనిచ్చారని గుర్తుచేశారు. అంతేకాక, రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల్లో 80శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకే దక్కుతున్నాయంటే సీఎం ఆయా వర్గాల వారి అభ్యున్నతికి చేస్తున్న కృషిని అర్థం చేసుకోవచ్చన్నారు. అందుకే సామాజిక న్యాయం విషయంలో ఎంతో ప్రాధాన్యతనిస్తున్న తమ పార్టీకి ఓట్లు అడిగే హక్కు, దమ్ము ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు.

### అడుగడుగునా.. ఘనస్వాగతం

తొలుత, ఈ యాత్ర వింజమూరు మండలం నుంచి ప్రారంభమై దుత్తలూరు మీదుగా ఉదయగిరికి చేరుకుంది. వింజమూరులో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభసభ్యులు విజయసాయిరెడ్డి, ఎంపీ బీద మస్తాన్ రావు, ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకులు రాజగోపాల్‌రెడ్డి, మేయర్ స్రవంతి, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి తదితరులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున ఘనస్వాగతం పలికారు. ఈ యాత్రలో అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు వింజమూరులోని శ్రీ చెన్నకేశవస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం, దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి దుత్తలూరు మీదుగా ఉదయగిరికి చేరుకున్నారు.



# వైకాపా పాలనలోనే.. ఆలయాల అభివృద్ధి

## - ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వ చొరవతో టీటీడీ వారు పలు ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారని ఆయన తెలిపారు. ఇటీవల విడవలూరు మండలంలోని దండిగుంట గ్రామంలో శ్రీ సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో జరిగిన విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ ఆలయానికి టీటీడీ 10 లక్షల రూపాయలు ఇచ్చిందని, మిగిలిన నిధులు దాతలు సమకూర్చారని పేర్కొన్నారు. దేవాలయ అభివృద్ధికి నిధులిచ్చిన దాతలను ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

# పొట్టి శ్రీరాములుకి ఆచార్య సిఎంకె రెడ్డి నివాళి



ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నవంబర్ 1న చెన్నై, మైలాపూర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు ఆచార్య సి.ఎం.కె.రెడ్డి, పక్కన కె.అనిల్‌కుమార్‌రెడ్డి, వి.కృష్ణారావు, జి.ఇస్రాయిల్, ఎం.వి.నారాయణగుప్తా, ఎన్.విజయకుమార్, జెఎం నాయుడు, ఏ.వి శివకుమారి, వి.శశికళ, జి.చెన్నయ్య, ఆర్.దామోదరన్, జి.మురళి, పాల్ కొండయ్య.


# ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

## - నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమపథకాలను ప్రజలందరికీ వివరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచించారు. అక్టోబరు 29న ఆయన వాకాడులో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. నవంబరు 9 నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నామని, ప్రజలకు ముఖ్యమంత్రి జగన్ అందజేస్తున్న పథకాలను, వాటి ప్రయోజనాలను తెలియజెప్పాలని కోరారు. కొడవలూరు దామోదర్‌రెడ్డి, రైతు రామకృష్ణ, వాకాటి నాగభూషణమ్మ, వెంకటరత్నమ్మ, సుధాకర్ నాయుడు, కోటేశ్వరరెడ్డి, అజిత్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# 93వ జయంతి



జననం: 08-11-1930 నిర్యాణం: 18-01-1995

## కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు

వ్యవస్థాపకులు, లాయర్ వారపత్రిక

# శ్రీసిటీలో రక్తదాన శిబిరం




పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని అక్టోబరు 30న శ్రీసిటీలో పెద్దఎత్తున రక్తదాన శిబిరం జరిగింది. శ్రీసిటీ ఫౌండేషన్, నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో శ్రీసిటీ పోలీసులు స్థానిక బిజినెస్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఈ శిబిరానికి శ్రీసిటీ డెప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జగదీష్‌నాయక్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ శ్రేయస్సులో పోలీసుల పాత్ర, వారి త్యాగాల గురించి తెలియచేశారు. ప్రజాసేవా దృక్పథంతో శ్రీసిటీ యాజమాన్యం సహకారంతో ప్రతి ఏడాది రక్తదాన శిబిరం ఏర్పాటుచేస్తున్నామన్నారు. అనంతరం, ఈ శిబిరంలో రక్తదానం చేసిన పోలీసు సిబ్బంది, శ్రీసిటీ పరిశ్రమల ఉద్యోగులు, విద్యార్థులకు, గ్రామస్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమాజ శ్రేయస్సులో పోలీసుల పాత్ర, త్యాగాలు వెలకట్టలేనివని ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో పేర్కొన్నారు. సాంకేతికపరంగా వైద్యరంగం ఎంతో అభివృద్ధి సాధిస్తున్నా, రక్తానికి సంబంధించి ఎలాంటి ప్రత్యామ్నాయాలు లేవన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ–నెల్లూరు పీఆర్ఓ మధుసూధనరావు, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్ పర్యవేక్షణలో ఎక్సలెంట్ ఫార్మా సైన్స్, వెర్మీరెన్ ఇండియా రిహాబ్, కోల్‌గేట్ పామోలివ్, ఫాక్స్‌కాన్, హుటామాకి–పిపిఎల్ పరిశ్రమల ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, శ్రీసిటీ సెక్యూరిటీ సిబ్బంది, పరిసర గ్రామాల ప్రజలతో సహా సుమారు వంద మందికి పైగానే ఈ శిబిరంలో రక్తదానం చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్, సెక్యూరిటీ చీఫ్ రమేష్, శ్రీసిటీ సీఐ భాస్కర్, ఎస్సై అరుణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ఎన్‌బికెఆర్‌లో టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల టేబుల్ టెన్నిస్ పురుషులు–మహిళల ఎంపికలు జరిగాయి. జెఎన్‌టియు అనంతపురం పరిధిలోని ఏడు జిల్లాలకు చెందిన వివిధ కళాశాలల నుంచి 75 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయ కుమార్‌రెడ్డి, జెఎన్‌టియు–అనంతపురం స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ బి.జోజిరెడ్డి పర్యవేక్షణలో ఎంపికలు జరిగాయి. న్యాయ నిర్ణేతలుగా ప్రొఫెసర్ ఎన్.నటరాజ్ సురేష్, శ్రావణ్‌కుమార్ వ్యవహరించారు. మహిళా జట్టు తరఫున నిఖిత, లక్ష్మి, అంకిత, ప్రత్యూష, గ్రేస్, అంజలి ఎంపికయ్యారు. పురుషుల జట్టులో ఆర్.మోహన్, ఎస్‌విఎస్ కృష్ణ, బి.సాయికృష్ణ, ఎస్‌ఏ ప్రయీమ్, బి.జయచంద్రలు ఎంపికైనట్లు ప్రకటించారు. ఈ జట్లకు ఎన్‌బికెఆర్ కళాశాలలో 10 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ డా.వి మల్లికార్జునరెడ్డి తెలిపారు.

## కరువుతో రైతులు అలమటిస్తున్నా..

# పట్టించుకోని ప్రభుత్వం

**- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు ధ్వజం**



జిల్లాలో రైతులు సాగునీళ్ళు లేక పంటలు పండించుకోలేక నానా అవస్తలు పడుతున్నారని, సోమశిల జలాశయంలో నీళ్ళు అడుగంటిపోవడంతో పంటపొలాలు బీడుపడి జిల్లా కరువు కోరల్లో చిక్కుకుంటోందని, అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని జిల్లాకాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర కాంగ్రెస్ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఛైర్మెన్ చేవూరు దేవకుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. అక్టోబరు 29న నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో, డీసీసీ అధ్యక్షునిగా మూడవసారి నియమితులైన చేవూరు దేవకుమార్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులుగా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సీవీ శేషారెడ్డి, ఉడతా వెంకట్రావ్‌యాదవ్‌లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన జిల్లా పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో చేవూరు మాట్లాడుతూ, మూడోసారి డీసీసీ అధ్యక్షునిగా తనను నియమించిన పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేస్తామని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వ అక్రమాలకు అడ్డేలేకుండా పోతోందని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. అనంతరం, పార్టీనాయకులు చేవూరును, సీవీ శేషారెడ్డిని, వెంకట్రావ్‌యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు లేళ్లపల్లి సురేష్‌బాబు, తలారి బాలసుధాకర్, ఏటూరి శ్రీనివాసులురెడ్డి, కొండా అనిల్‌కుమార్, షేక్ అల్లాఉద్దీన్, అన్నం లత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ఆర్డీఓను కలిసిన లీలారాణి



గూడూరు తహశీల్దార్‌గా పనిచేస్తున్న లీలారాణి డెప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి సాధించారు. ఆ మేరకు ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆమె పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్‌ను ఈ నెల 1వ తేదీ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఏబివిపి నగర సమావేశం



అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబివివి) గూడూరు నగరశాఖ ఆధ్వర్యంలో నగర అభ్యాసవర్గ సమావేశం ఇటీవల జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏబివిపి తిరుపతి జిల్లా కన్వీనర్ సన్నీ మాట్లాడుతూ గత 75 సంవత్సరాలుగా ఏబివిపి విద్యార్థుల కోసం, ఈ దేశం కోసం పనిచేస్తోందని, ఇలాంటి విద్యార్థి సంఘంలో పనిచేయడం అదృష్టం అని అన్నారు. ఆర్ఎస్ఎస్ జిల్లా సహ బౌధిక్ ప్రముఖ్ మల్లికార్జున మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తి భావాలు నింపేది ఒక్క ఏబివిపి మాత్రమేనని అన్నారు. అనంతరం ఏబివిపి గూడూరు నగర నూతన కార్యవర్గాన్ని ప్రకటించి, నగర కార్యదర్శిగా వినయ్ ఎన్నికైనట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మనోజ్‌కుమార్, చిన్న, అల్తాఫ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైలు ప్రమాద బాధితులు త్వరగా కోలుకోవాలి

విజయనగరం జిల్లాలో ఇటీవల రెండు రైళ్లు ఢీకొన్న సంఘటన కలచివేసిందంటూ సౌత్ సెంట్రల్ రైల్వే డిఆర్‌యుసిసి మెంబర్ మయూరి శ్యామ్‌యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని, బాధితులు తొందరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# అంగన్‌వాడీ కేంద్రానికి సామాగ్రి




లయన్స్ క్లబ్ విద్యా, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మెన్ షేక్ రియాజ్ అహ్మద్ తెలిపారు. ఈ నెల 1వ తేదీ గూడూరు పట్టణంలోని పూలతోట అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన పలు పరికరాలను లయన్స్ క్లబ్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి లయన్స్ క్లబ్ సహకరిస్తుందని ప్రకటించారు. క్లబ్ సేవా కార్యక్రమాలకు సభ్యులు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. అనంతరం సిడిపిఓలను క్లబ్ సభ్యులు శాలువాలు కప్పి సత్కరించారు. క్లబ్ సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉత్తర అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన 'నాటా అప్రీసియేషన్' కార్యక్రమంలో, నాటా సభ్యులచే సత్కారం అందుకుంటున్న గూడూరు మండల వైసీపీ అధ్యక్షుడు మల్లు విజయకుమార్‌రెడ్డి

# ప్రజాసేవకై జగనన్న సేవాసమితి



గూడూరు రూరల్ పేద ప్రజలకు సేవలు అందించడమే ముఖ్య లక్ష్యంగా వైయస్సార్ జగనన్న సేవాసమితి ఏర్పాటు చేయడం జరిగిందని వైసీపీ నాయకులు, జడ్పీటీసీ ఊటుకూరు యామిని భర్త ఊటుకూరు మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఈ నెల 1వ తేదీన పట్టణంలోని పిఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ఏర్పాటు చేసి వాటిని పూర్తిస్థాయిలో అమలుచేసి వారికి అండగా నిలుస్తున్నారని, జగనన్నను ఆదర్శంగా తీసుకొని గూడూరులో నిరుపేదలకు విద్యా, వైద్యం, ఆహారం అందించడమే ముఖ్య లక్ష్యంగా జగనన్న సేవా సమితి ఏర్పాటు చేశామని, త్వరలో పూర్తిస్థాయిలో సేవా కార్యక్రమాలు మొదలుపెట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.



ఢిల్లీలోని జాతీయస్థాయి ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్ నుండి డాక్టరేట్ అందుకున్న సయ్యద్ తాజుద్దీన్‌ని ఇటీవల సన్మానిస్తున్న తిరుపతి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పి.పరమేశ్వర్‌రెడ్డి.



## చిరస్మరణీయులు..

# శ్రీ పొట్టి శ్రీరాములు

**- విఎస్‌యు వీసీ సుందరవల్లి**

ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణా లర్పించిన శ్రీ పొట్టి శ్రీరాములు చిరస్మ రణీయులని, ఆయన సేవలు భావితరాలకు ఆదర్శమని విక్రమసింహపురి యూనివర్సిటీ (విఎస్‌యు) వైస్ చాన్సలర్ ఆచార్య జిఎం సుందరవల్లి కొనియాడారు, నవంబరు 1న ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సంద ర్భంగా విఎస్‌యు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని అమరజీవి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులు అర్పించారు. విఎస్‌యు రిజి స్ట్రార్ ఆచార్య పి రామచంద్రారెడ్డి, ప్రిన్సి పాల్ ఆచార్య జి.విజయ్ ఆనంద్‌కుమార్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్ పాల్గొన్నారు.

## కార్తీక దీపోత్సవానికి..

# ఇంటింటికీ ఆహ్వానం



నెల్లూరు నగరంలో ప్రతి మహిళ మహా కార్తీకదీపోత్సవం కార్యక్రమంలో పాల్గొనే విధంగా ఇంటింటికి వెళ్లి మహిళ లను ఆహ్వానిస్తున్నట్లు సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షులు డాక్టర్ కె. వెన్నెల చెప్పారు. బుధవారం నెల్లూరులో జరిగిన సింహపురి కార్తీక దీపోత్సవ సమితి సమావేశంలో ఆమె మాట్లాడుతూ, నవంబర్ 26వ తేదీ ఆదివారం నాడు నెల్లూరు నగర గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద నున్న నెల్లూరు చెరువు గణేష్ ఘాట్‌లో మహా కార్తీక దీపోత్సవం జరుగుతుంద న్నారు. ఆ రోజున ఉదయం 6 గంటలకు గోపూజతో ప్రారంభమయ్యే మహా శివ లింగ ప్రతిష్ఠ, రుద్రాభిషేక రుద్రహోమాలు, గంగా హారతి, ఆకాశదీపం, మహా కార్తీక దీపోత్సవ కార్యక్రమాలతోపాటు, ప్రముఖ స్వామీజీల ప్రవచనాలు, ఆధ్యాత్మిక సాం స్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. సమితి ప్రధాన కార్యదర్శులు కె.రాజేశ్వరి, బయ్యా మల్లిక, సుజాతమ్మ, కోడూరు జయప్రద, ముక్కాల వ్యాస ప్రసాద్, సీవీ సుబ్రహ్మణ్యం, కోడూరు జయరాం, రమేష్, ఏవిఆర్ మోహన్‌రావు, పి సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలభవన్ ఉత్సవాలకు

# విశ్వసాయి విద్యార్థులు

ఢిల్లీలో నవంబరు 17వ తేది నుంచి జరుగనున్న బాలభవన్ ఉత్సవాలకు నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విశ్వ సాయి డాక్టర్ ఎస్సార్కె స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ఆ విద్యాసంస్థల ఛైర్మెన్ డా.ఎన్ సత్యనారాయణ తెలిపారు. ఎంపి కైన విద్యార్థులను ఆయన అభినందించారు. స్కూల్ డైరెక్టర్ జి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఎస్.రఘురాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాలకు అవకాశం ఇస్తే..

# సంక్షేమ పథకాలు ఆగిపోతాయి

**- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి**



రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషిచేస్తు న్నారని, ప్రజలు వైకాపా పట్ల ఎనలేని ఆదరణ చూపుతున్నారని, ఈ నేపథ్యంలో సీఎం జగన్మోహన్‌రెడ్డిపై లేనిపోని విమ ర్శలు చేస్తూ అభివృద్ధి నిరోధకులుగా అడు గడుగునా అడ్డుపడుతున్న ప్రతిపక్షాలకు మద్దతు ఇస్తే, ఇప్పుడు పేద మధ్యతరగతి ప్రజలకు వస్తున్న అన్ని సంక్షేమ పథకాలు సగానికిపైగానే ఆగిపోవడం ఖాయమని నెల్లూరు ఎంపీ, రూరల్ వైకాపా సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన రూరల్ నియో జకవర్గంలోని చౌటుమిట్ట గిరిజనకాలనీలో 80 లక్షల రూపాయల నిధులతో పలు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున చేపడుతున్న రాష్ట్రం ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు సిఎం జగన్ మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. మాజీ డీసీసీబీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు టీవీయస్ కమల్, డివిజన్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్‌పై అమానుషంగా దాడిచేసిన...

# రౌడీమూకలపై ఉక్కుపాదం మోపాలి

- రాష్ట్రవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న నిరసనలు
- ఏడుగురు చిక్కారు..ప్రధాన నిందితులు దొరకలేదు

***కావలిలో రౌడీయిజం రాజ్యమేలుతోంది. రౌడీగ్యాంగ్‌లు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ దందాలకు, దౌర్జన్యాలకు దిగుతున్నా అడ్డుకునేవారు లేకపోవడంతో గత కొంతకాలంగా ఆ ప్రాంతంలో వారి అరాచకాలు మితిమీరి పోయాయి. తాజాగా ఒక ఆర్టీసీ డ్రైవర్‌ను రౌడీలు అమానుషంగా కొట్టడంతో ఆ ముఠాల అకృత్యాలు వెలుగులోకి వస్తున్నాయి. రోడ్డుమీదున్న కారును పక్కకు తీయాలంటూ హారన్ కొట్టినందుకు ఆర్టీసీ డ్రైవర్‌ను సీటులోంచి కిందకు లాగి, కాళ్లతో చేతులతో ఎగిరెగిరి కొడుతున్న దృశ్యాలు రాష్ట్రప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను ఇష్టమొచ్చినట్లు కొట్టడం ఆర్టీసీవర్గాలనే కాదు, జిల్లా ప్రజలను కూడా కలచివేస్తున్నాయి. నిందితుల్లో కొందరిని పోలీసులు పట్టుకున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులను కూడా అరెస్ట్ చేయాలని, ఆ దుర్మార్గులపై ఉక్కుపాదం మోపి, కఠినచర్యలు తీసుకోకుంటే రౌడీమూకలు మరింత బరితెగించిపోతాయని సర్వత్రా ఆందోళనగా ఉంది.***

విజయవాడకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ రాంసింగ్‌పై ఇటీవల కావలి వద్ద రౌడీగ్యాంగ్ దారుణంగా దాడిచేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. పోలీసులు అప్రమత్తమై ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ డా. తిరుమలేశ్వరరెడ్డి అక్టోబరు 29న నెల్లూరులో విలేకరులకు ఆ వివరాలు వెల్లడించారు. గతనెల 26న విజయవాడ ఆటోనగర్ డిపోకి చెందిన సూపర్‌లగ్జరీ ఆర్టీసీ బస్సు బెంగుళూరు నుంచి విజయవాడకు బయలుదేరిందని, మార్గమధ్యంలో కావలిలోని చేపలమార్కెట్ వద్దకు వచ్చేసరికి అక్కడున్న కారును చూసి బస్సు డ్రైవర్ రాంసింగ్ హారన్ మోగించాడని, దీంతో కారులోని నలుగురు బస్సును ఆపించి డ్రైవర్‌పై దాడిచేశారని, అంతేకాక బస్సు శివారుల్లోకి రాగానే రెండు కార్లలో మరికొందరితో కలిసివచ్చిన దుండగులు మరోసారి డ్రైవర్‌ను విచక్షణారహితంగా కొట్టారని తెలిపారు. దాడిని అడ్డుకోబోయిన మరో డ్రైవర్ శ్రీనివాసరావుపై, బస్సులో ప్రయాణికులపై కూడా వారు దౌర్జన్యానికి పాల్పడ్డారన్నారు. వీడియోలు తీస్తున్న వారి ఫోన్లు లాక్కొని ధ్వంసం చేశారని ఎస్పీ చెప్పారు. డ్రైవర్‌పై దాడిచేస్తున్న వీడియో ఫుటేజీని పరిశీలించి మొత్తం 14 మంది దుండగులు ఆ దాడికి పాల్పడినట్లు గుర్తించామని, వారిలో బండి విల్సన్, పుట్టా శివకుమార్‌రెడ్డి, షేక్ ఖాజావలి, కుప్పాల వంశీ, షేక్ కలీమ్, షేక్ ఇలియాజర్, షేక్ బాజాలను 24 గంటల్లోనే అరెస్ట్ చేశామన్నారు. నిందితులకు నేరచరిత్ర ఉందని, కావలి ప్రాంతంలో వీళ్ళు ఎన్నో ఏళ్లుగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రధాన నిందితుడు దేవరకొండ సుధీర్‌తో పాటు మిగిలిన నిందితులందరినీ అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించామన్నారు. ఏదేమైనా, పెద్దవయసున్న బస్సు డ్రైవర్‌పై నేరగాళ్ళు అత్యంత దారుణంగా దాడిచేయడం పట్ల ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. దుండగులను తప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు, ప్రధాన నిందితులు దొరుకుతారో లేదోననే అనుమానాలు కూడా సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఎలాంటి విమర్శలకు తావులేకుండా నిందితులందరినీ అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

# పంచారామాలకు ప్రత్యేక బస్సులు

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని కార్తీక సోమవారం రోజుల్లో ప్రముఖ శైవక్షేత్రాలైన పంచారామాలను భక్తులు దర్శించుకునేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపడానికి ఏర్పాట్లు చేసింది. అమరావతిలోని అమరారామం, భీమవరంలోని సోమేశ్వరారామం, పాలకొల్లులోని క్షీరారామం, ద్రాక్షారామంలోని భీమేశ్వరారామం, సామర్ల కోటలోని కుమారారామం క్షేత్రాలకు నెల్లూరు ప్రధాన బస్టాండ్ నుంచి బస్సులుంటాయని ఆర్టీసీ ఆర్ఎం పీవీ శేషయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్తీక మాసంలో ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు నెల్లూరు నుంచి బస్సు బయలుదేరుతుందని, పంచారామాల క్షేత్ర దర్శనమయ్యాక సోమవారం రాత్రి తిరుగుప్రయాణమై మంగళవారం ఉదయం 8గంటలకు నెల్లూరుకు చేరుతుందని వివరించారు. ఈ ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సుల్లో భక్తులకు ఒక్కొక్కరికి 2500 రూపాయలు ఛార్జీ ఉంటుందని, నవంబరు 19, 26, డిసెంబరు 3, 10 తేదీల్లో నెల్లూరు నుంచి ఈ బస్సులు బయలుదేరుతాయని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## టూకీగా...



### పున్నూరులో పర్యటించిన తమిళనాడు అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష' సర్వే తీరు తెన్నులను తెలుసుకునేందుకు తమిళనాడు అధికారుల బృందం అక్టోబరు 29న ఇందుకూరుపేట మం డలం పున్నూరులో పర్యటించింది. స్థానిక అధికారులను అడిగి వివరాలు తెలుసుకుంది. తహశీల్దార్ సుబ్బయ్య, డిఎస్ఎల్ఓ హనుమాన్‌ప్రసాద్, సర్వే అధికారులు పాల్గొన్నారు.

### వాలమేడులో అర్చక కుటుంబానికి చేయూత

వాకాడు మండలంలోని వాలమేడు గ్రామంలో ఇటీవల మృతిచెందిన పేద బ్రాహ్మణ మహిళ తిరుపత్తూరు రేణు కమ్మ ఉత్తరక్రియల కోసం శ్రీ సీతారామ ధార్మికసేవాసంస్థ ప్రతినిధులు దివి అనంతబాబు, శ్రీరామసేన ప్రతినిధులు హరీష్‌రెడ్డి, శివకుమార్‌లు ఆమె కుటుంబసభ్యులకు బియ్యం, పలసరుకులతో పాటు కొంత ఆర్థికసాయం అందించారు.

### పేద కుటుంబాలకు మంగళసూత్రాల వితరణ

బోగోలు మండలం ఎస్‌జిపి కండ్రిగ, దగదర్తి మండలాల్లో నిరుపేదలైన మూడు కుటుంబాల్లో జరుగుతున్న వివాహాల సందర్భంగా, ఇటీవల పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ పసుపులేటి సుధాకర్‌రావు తరఫున ట్రస్ట్ ప్రతినిధి పసుపులేటి వెంకటేశ్వర్లు బంగారు మంగళసూత్రాలను వితరణగా అందజేసి, ఆ కుటుంబాలకు ఆశీస్సులు తెలిపారు.

### చేనేత సమాఖ్య జిల్లా కమిటీ ఎన్నిక

అఖిలభారత చేనేత సమాఖ్య జిల్లా కమిటీని అక్టోబరు 29న నెల్లూరులోని చేనేత కార్మికసంఘం కార్యాలయంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా భువనగిరి మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా ఎన్.శ్రీనివాసులు, కోశాధికారిగా టి.పద్మనాభం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమాఖ్య నేతలు కుమారస్వామి, లక్ష్మీనారాయణ, త్యాగరాజు తదితరుల సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. ఎన్నికైన కొత్త కమిటీని నాయకులు అభినందించారు.

### వేదగిరిలో నవంబరు 7వరకు.. ధర్మప్రచారం

నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై కొలువైవున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నవంబరు1 నుంచి 7వ తేది వరకు ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహిస్తామని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

### పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

పొదలకూరు మండలంలోని అయ్యగారిపాళెం గ్రామానికి చెందిన కండే శ్రీలక్ష్మి అనే పేదవిద్యార్థినికి తిరుపతి ఇంజనీరింగ్ కాలేజీలో హాస్టల్ ఖర్చుల కోసం స్థానిక ఆర్ఆర్ దంతవైద్య కళాశాల నిర్వాహకులు డాక్టర్ చక్రపాణి అక్టోబర్ 28న 15 వేల రూపాయలను ఆర్థికసాయంగా అందజేశారు.

### నార్త్ రాజుపాళెంలో పంట నమోదు పరిశీలన

కొడవలూరు మండలంలోని నార్త్ రాజుపాళెం గ్రామంలో ఉన్న రైతుభరోసా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్ రాజు ఇటీవల సందర్శించి పంట నమోదు వివరాలను పరిశీ లించారు. దీని ఆధారంగానే రైతులకు పంట బీమా, పంట కొనుగోలు తదితర ప్రయోజనాలుంటాయని, కనుక తప్పులు లేకుండా జాబితాను రూపొందించాలని అధికారులకు సూచించారు.

### కోవూరులో రౌడీలకు ఎస్ఐ కౌన్సిలింగ్

కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న రౌడీలకు అక్టోబరు 29న ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ కౌన్సిలింగ్ ఇచ్చారు. రౌడీలు తమ ప్రవర్తన మార్చుకోవాలని, చేసిన తప్పులు తెలుసుకుని మంచిగా నడచుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### విరువూరులో దొంగలుపడ్డారు

వరికుంటపాడు మండలం విరువూరులో ఇటీవల చోరీ జరిగింది. మామిళ్ళపల్లి రమణారెడ్డి ఇంట్లో నిద్రపోతున్న సమయంలో, దొంగలు ఇంటి గేటు తాళాలు పగలగొట్టి ఇంట్లోకి జొరబడి లక్ష రూపాయలతో పాటు, ఇంటివద్ద దుకా ణంలో ఉన్న మరో రూ.10వేలు కూడా అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# నారా కారాగార కథకి... విరామమా... సమాప్తమా?

(మొదటి పేజీ తరువాయి)

విమానంలో గప్‌చిప్‌గా హైదరాబాద్‌లోని తన ఇంటికైనా వెళ్ళుండాల్సింది. లేదా, విమానంలోనే విజయవాడలోని తన నివాసానికి చేరుకొని ఉండవచ్చు.

కానీ, చంద్రబాబు అలా చేయలేదు. వచ్చిన ఏ అవకాశాన్నైనా తనకు అనుకూలంగా మార్చుకుని వాడుకోవడంలో ఆరితేరిన బాబు ఈ మధ్యంతర బెయిల్‌ను కూడా చక్కగా తన రాజకీయ ప్రయోజనాలకు వాడుకున్నారు.

జైలు నుంచి విడుదలైన వెంటనే జైలు బయట తన కోసం గుమికూడిన వారిని ఉద్దేశించి ప్రసంగించారు. అక్కడినుంచి కారులో 14 గంటలు ప్రయాణించి మార్గమధ్యంలో తెలుగుదేశం కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు అభివాదం చేసుకుంటూ, మరుసటి రోజు ఉదయం ఆరు గంటలకు విజయవాడలోని తన నివాసానికి చేరుకున్నారు. కేవలం 167 కిలో మీటర్ల దూరానికి ఆయనకి అంత సమయం పట్టింది. మంగళవారం రాత్రి ఆయన నిద్రపోలేదు. రాత్రి అంతా కారులోనే కూర్చుని ఉన్నారు. తనని అరెస్టు చేసిన రోజూ ఆయన నిద్ర పోలేదు. బెయిలుపై బయటకి వచ్చిన రోజూ అయనకి కంటిమీద కునుకు లేదు.

జైలు నుండి విడుదలై ఇంత ఉత్సాహంగా, ఉల్లాసంగా జైత్రయాత్ర జరిపిన బాబుకి అనారోగ్యం ఎక్కడ...? అన్న విషయం ఈ దృశ్యాలను టీవీల్లో చూసిన వారికీ, జరుగుతున్న పరిణామాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న రాజకీయ విశ్లేషకులకి అర్థం కాలేదన్నది కొందరు పరిశీలకుల అభిప్రాయం.

భారతీయ పౌరుడికి స్వేచ్ఛగా జీవించే హక్కును ఒక్క న్యాయస్థానాలు తప్ప, మరెవరూ హరించలేరు అని సుప్రీం కోర్టు గతంలో పలు సందర్భాలలో పేర్కొంది. విచారణ ఖైదీకైనా, శిక్ష పడిన ఖైదీకైనా ఈ నియమం వర్తిస్తుంది. ప్రాణాంతక అనారోగ్యం ఎదురైన సందర్భాలలో... ఓ ఖైదీ... తన ఖర్చుతో, తనకు నచ్చినచోట చికిత్స చేయించుకునే హక్కు కలిగి ఉంటారనడంలో ఆక్షేపణ ఏమీ లేదు. జీవించే హక్కే, అన్ని హక్కులకూ తలమానికం వంటిది కనుక, సుప్రీం కోర్టు... ఖైదీలకు ఈ వెసులుబాటు ఇచ్చింది.

మరి, చంద్రబాబు ప్రస్తావించిన రుగ్మతలేవీ ప్రాణాంతకమైనవి కావు.

ఒకటి... చర్మ సంబంధితమైంది. ఆయనకి చర్మ సంబంధిత సమస్య ఉందన్నది జగమెరిగిన సత్యం. ఇక, రెండవది... కన్నుకు క్యాటరాక్టు సర్జరీ. ఒక కన్నుకు ఇదివరకే ఆయన ఆపరేషన్ చేయించుకున్నారు. కనుక, దృష్టి లోపం కూడా లేదు. క్యాటరాక్ట్ అన్నది ఏ రకమైన 'అనారోగ్యం' కానే కాదని, అవకాశాన్ని బట్టి చేయించుకునే శస్త్ర చికిత్స అని ఆప్తాల మిస్ట్‌లు చెప్తున్నారు.

ఈ కోణంలో చూసినప్పుడు బాబుకి ఏ రకమైన అనారోగ్యం లేదని స్పష్టంగా అర్థమైపోతుంది. అయినా, 'అనారోగ్య' కారణాలపై బెయిల్ వచ్చింది. అది మధ్యంతరం అయినా, మామూలు బెయిల్ అయినా... బెయిల్ - బెయిలే. జనం దృష్టిలో రెండూ ఒక్కటే.

ప్రస్తుతం అటు పార్టీ శ్రేణులని, ఇటు రాజకీయవర్గాలని వేధిస్తున్న ప్రశ్న ఒక్కటే... నవంబర్ 28వ తేదీ సాయంత్రం అయిదు గంటల లోపల చంద్రబాబు మళ్లీ రాజమండ్రి జైలుకి తిరిగివస్తారా? రారా..?? అని. అయితే "ఖచ్చితంగా రారు..." అని కొందరు న్యాయవాదులు చెపున్నారు.

ఇందుకు కారణాలు కూడా లేక పోలేదు. మాజీ ముఖ్యమంత్రులు, మంత్రుల వంటి పబ్లిక్ సర్వెంట్స్‌పై క్రిమినల్ కేసులు నమోదుకు గవర్నర్ ముందస్తు ఆమోదాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్రం, అవినీతి నిరోధక చట్టానికి చేసిన (17ఏ) సవరణ ఇప్పుడు చంద్రబాబు విషయంలో వర్తిస్తుందా... లేదా...? అన్న విషయమై సుప్రీం కోర్టులో హోరాహోరీగా వాదనలు జరిగాయి. తీర్పు వెలువడాల్సి ఉంది. చంద్రబాబుపై కేసులకు ఆ సవరణ వర్తిస్తుంది అంటే... ఆయనపై ప్రభుత్వం పెట్టిన కేసులన్నీ మూసివేస్తారు. మళ్లీ కేసు పెట్టాలి అంటే, గవర్నర్ ఆమోదం తప్పనిసరి అవుతుంది. అది అంత తేలిక కాదు. గవర్నర్లు అంటే కేంద్ర ప్రభుత్వం అభీష్టం మేరకు పనిచేస్తారు. అలాంటి సమయంలో గవర్నర్ ఆమోదం అంటే.. బీజేపీ ఆమోదం అని అర్థం వస్తుంది. కాబట్టి బాబు వ్యవహారంలో ఆయనకి వ్యతిరేకంగా ప్రత్యక్షంగా తలదూర్చడానికి కేంద్రం ఆసక్తి చూపకపోవచ్చు.

ఈ క్రమంలో తాత్కాలికంగా బాబుని పక్కనపెట్టి, చినబాబుపై వైసీపీ గురిపెట్టి లోకేష్‌ని టార్గెట్ చేస్తుందని కూడా విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ ఆ సెక్షన్ చంద్రబాబుకు వర్తించదు అని సుప్రీం కోర్టు అంటే... అన్ని కేసుల్లోనూ ముందస్తు బెయిల్ కోసం చంద్రబాబు న్యాయవాదులు తీవ్రంగా ప్రయత్నిస్తారు. లీగల్‌గా చంద్రబాబుని ఎంత ఇబ్బందిపెడితే వైసీపీ ప్రభుత్వంపట్ల జనాగ్రహం అంతగా పెరుగుతుందని ఒక సీనియర్ వైసీపీ నాయకుడే వాపోవడం విశేషం. టీడీపీపై ప్రజలలో సానుభూతి కూడా అదే స్థాయిలో ఏర్పడుతుందని కూడా ఆయన అభిప్రాయం.

నిజానికి వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఆ పార్టీ అధినేతే తరచూ తన ప్రసంగాల్లో బాబు ప్రస్తావన తెస్తూనే ఉన్నారు. పదే పదే ఆయన వైఫల్యాలని ప్రస్తావించి బాబుని తెరమరుగు చేయాలన్నది బహుశా జగన్ వ్యూహం కావచ్చు. కానీ, ప్రజలే తమకొద్దని పక్కనపెట్టేసిన చంద్రబాబు జపం ఈయన చేస్తూ బాబుని ప్రజలకి గుర్తుచేస్తూ వచ్చారన్నది ఎవరూ కాదనలేని వాస్తవమన్నది రాజకీయవర్గాల భావన. రాజకీయంగా బాబుని అబాసుపాలు చేయాలన్న ఆలోచనతో పాటు ఆయనని నేరస్తుడిగా కూడా ప్రజలముందుంచాలన్నదే వైసీపీ ఎత్తుగడ, ఆ క్రమంలోనే బాబుపై ఏపీ సీఐడీని ప్రయోగించారని అంటున్నారు విశ్లేషకులు. చంద్రబాబుకి, టీడీపీకి వైసీపీ పునర్జన్మ ప్రసాదించిందని, కేవలం 23 స్థానాలతో అస్థిపంజరంలా తయారైన పార్టీకి ఈ నాలుగేళ్ళల్లో వైసీపీ నేతలు పోటీలు పడి మరీ రక్త మాంసాలు ఎక్కించారని పరిశీలకులు అంటున్నారు. మొత్తానికి బాబు జైలు, బెయిలు ఉదంతం ఆంధ్ర రాజకీయాలలో పెనుసంచలనంగా మారింది. ఒకసారి బెయిలుపై వస్తే మళ్లీ లోపలకి వెళ్లడం అంటూ ఉండదు. పదేళ్ల నాడు బెయిలుపై వచ్చిన జగన్ మళ్లీ జైలుకి వెళ్లాడా...? అని తెలుగుదేశం శ్రేణులు ప్రశ్నిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ రాజకీయ డ్రామా ఇంకా ఎన్ని మలుపులు తిరగబోతోందో అన్న ఆసక్తి అన్ని రాజకీయవర్గాలలో కనిపిస్తోంది. ఇప్పటి వరకూ జరిగిన కథలో పైచేయి జగన్‌దా.. బాబుదా...? అన్న చర్చ కూడా సర్వత్రా నడుస్తోంది..!

# అర్బన్ రైజర్స్ హైదరాబాదు

(మొదటి పేజీ తరువాయి)



'భిల్వారా కింగ్స్' అని పిలుచుకుంటున్నారు. అయిదవదాన్ని మణిపాల్‌కి చెందిన మణిపాల్ వైద్య కళాశాల మరియు ఆసుపత్రుల యాజమాన్యం సొంతం చేసుకుని తమ టీమ్‌కి 'మణిపాల్ టైగర్స్' అని పేరు ఖాయం చేసుకున్నారు. దక్షిణాది రాష్ట్రాలకి చెందిన కొన్ని సంస్థలు సమిష్టి భాగస్వామ్యంతో 6వ టీమ్‌ని కొనుగోలు చేసి 'సదరన్ సూపర్ స్టార్స్'గా పేరు పెట్టుకున్నారు. మన దేశానికి చెందిన సురేష్ రైనా 'అర్బన్ రైజర్స్ హైదరాబాద్' టీమ్‌కి కెప్టెన్‌గా ఉండగా న్యూజిలాండ్ ఆటగాడు మార్టిన్ గుప్తిల్, వెస్టిండీస్‌కి చెందిన డ్వయిని స్మిత్, టినో బెస్ట్, జెరోమ్ టేలర్, ఇంగ్లాండు ఆటగాడు పీటర్ ట్రెగో, దక్షిణ ఆఫ్రికాకు చెందిన క్రిష్టోఫర్ మోపు, శ్రీలంక ఆటగాడు చమర కపుగెదేరాలతో పాటు భారత్‌కు చెందిన ఆటగాళ్ళు ప్రగ్యాన్ ఓఝా, స్టువర్ట్ బిన్నీ వంటి దిగ్గజాలు మన వాళ్లకి చెందిన 'అర్బన్ రైజర్స్ హైదరాబాద్' టీమ్‌లో ప్రధాన ప్లేయర్‌లుగా ఉన్నారు. నవంబర్ 18వ తేదీ నుండి డిసెంబర్ 10వ తేదీ వరకు జరిగే తొలి విడత 'లెజెండ్స్ లీగ్ టీ20 క్రికెట్ మ్యాచ్'లు స్టార్ స్పోర్ట్స్‌తో పాటు డిస్నీ హాట్‌స్టార్‌లో కూడా తిలకించవచ్చు.

ఇప్పటికే నిర్మాణ రంగంలో సంచలనాలని సృష్టిస్తున్న అలయన్స్, అర్బన్‌రైజ్ సంస్థలు క్రీడా విభాగంలో కూడా తమ సమర్థత చూపించేలా ఆటగాళ్ళని ప్రోత్సహించి కప్పు కైవసం చేసుకోవాలని ఆశిద్దాం. అల్ ది బెస్ట్ టు 'అర్బన్ రైజర్స్ హైదరాబాద్'.








# అమరజీవి త్యాగం మరువలేం

## జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావానికి కృషిచేసి అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరవలేనిదని, ప్రజల మనస్సుల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని నెల్లూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. ఆ మహనీయుని ప్రాణత్యాగం ఫలితంగా 1953లో ప్రత్యేక తెలుగు రాష్ట్ర ఏర్పాటైందని, ఆయన త్యాగనిరతి ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నవంబరు 1న నగరంలోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో ఆమె జాతీయ జెండాను ఎగురవేసి, పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరినారాయణన్, నగర మేయర్ స్రవంతి, కమిషనర్ వికాస్ మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ సంజనాసింహ, జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, ఆర్డిఓ మలోల తదితరులు పాల్గొని అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్ర్య సమర యోధుడు కె.వి. చలమయ్యను సత్కరించారు.

# విపిఆర్ మాతృమూర్తి స్మారకంగా... అన్నదానాలు

రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాతృమూర్తి వేమిరెడ్డి శ్యామలమ్మ 10వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె స్మారకంగా నవంబరు 1న వేమిరెడ్డి సిబ్బంది నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో అన్నదానాలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్క్ సాయిబాబా గుడిలోను, గీతామయి వృద్ధుల ఆశ్రమం, ప్రగతి చారిటబుల్ ట్రస్ట్, జనహిత వాత్సల్య నిరాధార బాలల ఆశ్రమాల్లోనూ పెద్దఎత్తున అన్నవితరణ జరిగింది. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..టీటీడీ ఢిల్లీ స్థానిక సలహామండలి ఛైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తమ సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి కొత్తదుస్తులు పంపిణీ చేశారు.

# శ్రీసిటీ ప్రగతి స్ఫూర్తిదాయకం

## 'జాగృతి' యాత్రా బృందం కితాబు






శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి తమ యాత్రా బృందానికి ఎంతో స్ఫూర్తిదాయకమని జాగృతి సంస్థ సీఈఓ అశుతోష్‌కుమార్ కితాబిచ్చారు. శ్రీసిటీ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వ్యాపారానుకూల వాతావరణం, స్థిరమైన పర్యావరణ వ్యవస్థ, ఉపాధి, ఉత్పత్తి సామర్థ్యం అద్భుతమంటూ కొనియాడారు. దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక నగరంగా ఎదుగుతున్న శ్రీసిటీ, తాము సందర్శనకు వచ్చే ప్రతిసారి కొత్తదనంతో కొత్త పరిశ్రమలతో కనిపిస్తోందని ప్రశంసించారు. తమ యాత్రా బృందానికి ఈ ప్రాంతం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు మరియు జి20 దేశాలకు చెందిన సుమారు 520 మంది 'జాగృతి జి20 స్టార్టప్ 20 యాత్ర' బృందం నవంబరు 1న శ్రీసిటీని సందర్శించింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారుచేసే లక్ష్యంతో జాగృతి సేవా సంస్థాన్ స్వచ్ఛంద సంస్థ ఏటా చేపట్టే ఈ జాగృతి యాత్ర, ప్రత్యేక రైలు ప్రయాణం ద్వారా దేశమంతా పర్యటించి, వివిధ రంగాలలో ఆదర్శవంతులను కలుసుకుని వారితో సంభాషించడం ద్వారా యాత్రికులలో స్ఫూర్తిని నింపుతుంటుంది. ఈ యాత్రలో భాగంగా శ్రీసిటీకి వచ్చిన బృందానికి స్వాగతం పలికిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, జాగృతి యాత్ర బృందం శ్రీసిటీకి రావడం ఆనందంగా ఉందన్నారు.

# సంపాదన తప్ప.. సమస్యలు పట్టని మంత్రులు

## సోమిరెడ్డి విమర్శ

రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడినా సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలకు మాత్రం తమ సంపాదన మీదే ధ్యాస తప్ప రైతుల సమస్యలు పరిష్కరించడం లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. అక్టోబరు 29న కావలిలో టీడీపీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు అధ్యక్షతన జరిగిన కావలి నియోజకవర్గ టీడీపీ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జిల్లా రైతాంగానికి ప్రాణప్రదమైన సోమశిల, కండలేరు జలాశయాల్లో నీళ్ళు అడుగంటిపోయాయని, ఆ జలాశయాలు మరమ్మతులకు గురైనా, వాటిని బాగుచేయించాలన్న ఆలోచన కూడా ప్రభుత్వానికి లేకపోవడం విచారకరమన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, టీడీపీ పరిశీలకుడు బొమ్మిరెడ్డి సురేంద్ర, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, గ్రంధి



యానాది శెట్టి, మన్నవ రవిచంద్ర, శ్రీదేవి, అలేఖ్య, శ్రీనివాసులు, కిషోర్, జ్యోతి బాబూరావు పాల్గొన్నారు.

# కామిడోక్రసీ...!



మహారాష్ట్ర అసెంబ్లీలో శివసేన టికెట్‌పై శాసనసభకు ఎన్నికైన వారిలో ఓ ముప్పైమందిని చీల్చి, 'రాజ్యాంగ బద్ధం'గా రూపుదాల్చిన ప్రజాస్వామిక పాలకవర్గాన్ని అధికారం నుంచి తప్పించి..., మహారాష్ట్ర ప్రభుత్వ నిర్వహణను ఈ అప్రజాస్వామిక గ్యాంగ్‌కు అప్పగించారు. వీరితో బీజేపీ చేతులు కలిపింది. కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్న వారు దీనిని ఆశీర్వదించారు. ఈ అక్రమం 2021లో చోటు చేసుకుంది.

మన సువిశాలదేశంలో ఎన్నికలు – స్వేచ్ఛా నిర్వహణ – రాజకీయ పార్టీలు – వాటి నడవడికను పర్యవేక్షించడానికి, నిర్ధేశించడానికి సమస్త అధికారాలతో కూడిన ఒక సర్వ స్వతంత్ర ఎన్నికల సంఘాన్ని రాజ్యాంగం ఏర్పాటు చేసింది. ఆ ఎన్నికల సంఘమే... ఈ ఫిరాయింపుదారులదే అసలైన శివసేన అంది. ఎన్నికల గుర్తు దానికే ఇస్తున్నాం అని అంది. శివసేన బ్యాంకు ఖాతాలు దానికే చెందుతాయి అని తీర్పు చెప్పింది.

అసలు శివసేన వారు సుప్రీం కోర్టుకు పరిగెత్తారు.

పార్టీ ఫిరాయించిన వారందరినీ రాజ్యాంగం పదో షెడ్యూల్ కింద శాసనసభ్యత్వానికి అనర్హులుగా ప్రకటించాలని శివసేన శాసనసభా పక్ష నాయకుడు, మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్‌కు 2021లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసి ఇప్పటికి రెండేళ్లు అయింది.

స్పీకర్ నిర్ణయం తీసుకోలేదు. సుప్రీంకోర్టుకు కోపం వచ్చింది. స్పీకర్‌ను మందలించినంత పని చేసింది. స్పీకర్ పట్టించుకోలేదు.

వచ్చే ఏడాది మహారాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అప్పటి దాకా సాగదీసి, ఫిరాయింపుదారులు పూర్తిగా అధికారం అనుభవించేలా చేసి, ఎన్నికల నోటిఫికేషన్ ముందు నిర్ణయం ప్రకటించాలని స్పీకర్ ఆలోచిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. ఈ డ్రామా మొత్తానికి కేంద్ర పాలకుల ఆశీస్సులు సంపూర్ణంగా ఉన్నాయి. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఔన్నత్యం గురించి... చక్కని హావభావ ప్రదర్శనతో మన ప్రధానమంత్రి అసువుగా చెబుతుంటే.... వినేవారికి ఆనందంతో ఒళ్ళు పులకరించిపోతూ ఉంటుంది.

★★★★★

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌పార్టీకి చెందినవారిని 2018లో మెజారిటీ స్థానాలలో అక్కడి ప్రజలు ఎన్నుకున్నారు. దాంతో, అక్కడ రాజ్యాంగబద్దంగా కాంగ్రెస్‌పార్టీ నేతృత్వంలో ప్రభుత్వాధికారం చేపట్టింది. రెండేళ్లు తిరిగీతిరగక ముందే బీజేపీకి అవసరమైనంత మంది ఎంఎల్‌ఏలు బీజేపీలోకి ఫిరాయించారు. వారి చేత అసెంబ్లీకి రాజీనామా చేయించి, ప్రభుత్వ పాలనాధికారాన్ని కాంగ్రెస్ నుంచి గుంజేసుకున్నారు. ఫిరాయింపుదారులకు బీజేపీ టిక్కెట్లు ఇచ్చి, వారిని గెలిపించి, పాలనాధికారాన్ని చేజిక్కించుకున్నారు. రాజ్యాంగం వారిని ఏమీ అనలేదు.

★★★★★

కర్ణాటకలోనూ సే(షే)మ్ టు సే(షే)మ్ స్టోరీ. కాంగ్రెస్, జేడీ(ఎస్) శాసన సభ్యులను రాత్రికి రాత్రి దొంగిలించేశారు. ముంబై కొట్టుకుపోయారు. వారికి పోలీసులను కాపలా పెట్టారు. చివరకు కర్ణాటకలో ప్రభుత్వ పాలనాధికారాన్ని ఒక బొమ్మ(య్)కు అప్పగించారు. రాజ్యాంగం... కుయ్... అంటే ఒట్టు.

★★★★★

ఆంధ్రప్రదేశ్ శాసనసభకు 2014లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ 102 స్థానాలు గెలుచుకుంది. మొత్తం 175 స్థానాల్లో 88 వస్తే, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. టీడీపీకి 88కి మరో 14 స్థానాలు అదనంగా వచ్చాయి. అంటే.. 102 స్థానాలు వచ్చాయి.

అయినా, వైసీపీ టికెట్ మీద గెలిచిన ఓ 23 మంది శాసనసభ్యులు తెలుగుదేశంలోకి ఫిరాయించారు. ఫిరాయించిన వారెవరూ వైసీపీకి రాజీనామా చేసి, టీడీపీ టికెట్‌పై శాసనసభకు తిరిగి ఎన్నికవ్వలేదు. ఆ కండువా అవతల పారేసి, ఈ కండువా కప్పుకున్నారు. తెల్లవారేసరికి తెలుగుదేశంలో చేరారు. అందులో ముగ్గురు నలుగురు మంత్రులు కూడా అయ్యారు. వీరందరి మీదా అనర్హత వేటు వేయాలని వైసీపీ శాసన సభా పక్షం... స్పీకర్ కోడెల శివప్రసాద్‌కు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు ఏమైందో తెలియదు. అయినా, మన ప్రజాస్వామ్యం వారిని ఏమీ అనలేదు. రాజ్యాంగం కూడా...!

★★★★★

ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత శాసనసభలో వైసీపీకి 151 మంది శాసనసభ్యులు ఉన్నారు. మెజారిటీకి అవసరమైన వారికంటే ఓ 63మంది అదనంగా ఉన్నారు, చేతులు పైకి ఎత్తడానికి. అయినా టీడీపీకి చెందిన ముగ్గురు శాసనసభ్యులు వైసీపీలోకి ఫిరాయించారు. వీరిని అనర్హులుగా ప్రకటించాలని టీడీపీ శాసనసభా పక్షం... స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. శాసనసభ కాలపరిమితి ముగుస్తున్నప్పటికీ, గౌరవ స్పీకర్ ఆ ఫిర్యాదును పట్టించుకోలేదు. రాజ్యాంగం అంటే మన స్పీకర్‌కు చాలాగౌరవం. అది ఏమీ అనదని ఆయనకు తెలుసు.

మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఒక పార్టీ టికెట్‌పై గెలిచిన సభ్యుడు, తన సభ్యత్వానికి రాజీనామా చెయ్యకుండానే.... మరో పార్టీలోకి జంప్ అయితే "ఇలా ఎందుకు చేశావ్? మేము మిమ్మల్ని గెలిపించింది... వేరే పార్టీలోకి ఫిరాయించడానికా?" అని అడిగే హక్కు గెలిపించిన ఓటర్లకు లేదు. ఎందుకంటే, రాజ్యాంగానికి లేని ఇబ్బంది ఓటర్‌కు ఎందుకు? అన్నది పాయింట్.

★★★★★

మన ఓటర్లకు ఓట్ వేయడం ఒక్కటే డ్యూటీ. అది మినహా ఏ హక్కునూ మన రాజ్యాంగంలోని అధికరణలను రాసిన వాళ్లెవరూ ఇవ్వలేదు.

తాము ఓటేస్తే గెలిచి, చట్టసభల్లో అడుగుపెట్టిన వారు ఎటువంటి వారు అయినా వారిని అడిగే హక్కు ఓటర్లకు లేదు.






ఒక్క జైలు శిక్షలు పడినవారు తప్ప, ఎవరైనా చట్టసభల్లో ప్రవేశించి ప్రభుత్వ యంత్రాంగాన్ని పాదాక్రాంతం చేసుకోవచ్చు. జైళ్లల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నవారూ దర్జాగా చట్టసభల్లో అడుగు పెట్టవచ్చు. ప్రభుత్వ యంత్రాంగం చేత సమస్త దగుల్బాజీ పనులూ చేయించుకోవచ్చు. "మేము మిమ్మల్ని ఒక పార్టీ టికెట్‌పై గెలిపిస్తే... పార్టీ ఎందుకు మారారు?" అని అడిగే హక్కు ఓటర్లకు లేదు.

"ఏడాదికి పాతిక, ముప్పై రోజులే అసెంబ్లీ సమావేశాలు నడిపితే.. మిగిలిన మూడొందల పాతిక రోజులు వీళ్ళు ఏం చేస్తున్నారు?" అని తెలుసుకునే హక్కు ఓటర్లకు లేదు. ఒక్కసారి ఓటేస్తే, మళ్లీ ఎన్నికల నాటి వరకూ ఓటర్లను పురుగుల్లా చూసినా మన ప్రజాస్వామ్యం గానీ, రాజ్యాంగం గానీ పట్టించుకోవు. ఎన్నికైనవారు... ప్రతి ఏడాది వారి ఆదాయ వ్యయాలను తమను ఎన్నుకున్న వారికి చెప్పాలనే కట్టుబాటు ఏమీ లేదు.

★★★★★

ప్రజా ప్రతినిధులుగా చట్టసభలలో ఆశీనులు కావడానికి ఎటువంటి నేర చరితులకైనా మన రాజ్యాంగానికి అభ్యంతరం లేదు. హంతకులు, మానభంగాలే వృత్తిగా బతికేవారు, దొంగలు, కబ్జాకోరులు, ఫోర్జరీ స్పెషలిస్టులు, దొమ్మీల్లో పేరెన్నికగన్నవారు, రౌడీషీటర్లు, వివాహేతర లైంగిక సంబంధాలలో మునిగితేలేవారు... ప్రజలకు చెందాల్సిన ప్రకృతి వనరుల దోపిడీదారులు.... ఒక నేరం అనేముంది... భారత శిక్షాస్మృతిలో శిక్షలు వేయడానికి తగిన ఎన్ని నేరాలు ఉన్నాయో... ఆ నేరాలకు పాల్పడే వారు ఎవరైనా సరే చట్టసభల్లో ప్రవేశించడానికి మన ప్రజాస్వామ్యం గానీ, రాజ్యాంగం గానీ అస్సలు అడ్డుచెప్పవు.

★★★★★

మన చట్టసభల్లో అధికార పక్షము, ప్రతిపక్షము అని సభ్యులు రెండు రకాలు. సభలో మెజారిటీ సభ్యుల గ్రూపు అధికార పక్షం అవుతుంది. మెజారిటీ లేని గ్రూపు ప్రతిపక్షం అవుతుంది.

అంటే... ఒక చట్ట సభలో మొత్తం 100 స్థానాలు ఉన్నాయి అని అనుకుంటే.... 51 స్థానాలు కలిగిన గ్రూపును అధికారపక్షం అని, 49 స్థానాలు కలిగిన గ్రూపును ప్రతిపక్షం అంటాము.

రెండు గ్రూపులలోని వారికీ జీతభత్యాలు, ఇతర ప్రభుత్వపరమైన సౌకర్యాలు, రాయితీలు, వసతులు సమానమే.

అయితే, ప్రభుత్వ యంత్రాంగాన్ని మాత్రం మెజారిటీ గ్రూపు పూర్తిగా స్వాధీనం చేసుకుంటుంది. మొత్తం ప్రభుత్వ యంత్రాంగం... మెజారిటీ గ్రూపు కనుసన్నలలోకి వెళ్ళిపోతుంది.

నిజానికి, మెజారిటీ గ్రూప్ సభ్యులు ఎలా గెలిచారో... మైనారిటీ గ్రూపు సభ్యులూ అలాగే గెలిచారు.

వారు కోట్లు కుమ్మరించి గెలిచినట్టే... వీరూ కోట్లు గుమ్మరించి గెలిచారు. వారూ సారా బ్రాందీ పోసి గెలిచినట్టే.... వీరూ గెలిచారు. వారు ఉత్తుత్తి వాగ్దానాలు చేసి గెలిచినట్టే.... వీరూ ఉత్తుత్తి వాగ్దానాలు చేసి గెలిచారు. గెలవడానికి వారు ఎన్ని అక్రమపద్ధతులకు పాల్పడ్డారో.... వీరూ అన్ని అక్రమ పద్ధతులకు పాల్పడ్డారు. కాకపోతే, ఒక గ్రూపుకు ఎక్కువ స్థానాలు వస్తాయి. ఒక గ్రూపుకు తక్కువ స్థానాలు వస్తాయి.

అయితే, మెజారిటీ కంటే ఒక్క స్థానం తక్కువ వచ్చినా ఆ గ్రూప్‌కు దమ్మిడీ పనిని గానీ, ప్రభుత్వ నిర్వహణలో కనీస గుర్తింపును గానీ మన రాజ్యాంగం ఇవ్వలేదు. మెజారిటీ గ్రూపు పాదసేవకు అంకితమైపోయే ప్రభుత్వ యంత్రాంగం... అసలు ఈ గ్రూప్‌లో వారిని కనీసం ప్రజాప్రతినిధులుగా కూడా గుర్తించదు.

అమెరికా, ఇంగ్లండ్ వంటి పాశ్చాత్య (పాశ్చాత్య అంటే... మన దేశానికి పశ్చిమ వైపు ఉన్న అని అర్ధం) దేశాలలోనూ ప్రతి దేశంలోనూ ప్రజాస్వామ్య వ్యవస్థలే ఉన్నాయి. కానీ, అక్కడ ప్రభుత్వ పక్షానికి ఎంత విలువ, బాధ్యత ఉంటుందో... ప్రతిపక్షానికీ అంత విలువ, బాధ్యత ఉంటాయి.

అమెరికాలో అధ్యక్షుడుగా డెమోక్రటిక్ పార్టీకి చెందిన జో బైడెన్ ఉన్నారు. కానీ, రిపబ్లికన్ పార్టీ సహకారం లేకుండా ఆయన ఒక్కరోజు కూడా ప్రభుత్వాన్ని నడపలేరు.

ఇంగ్లండ్‌లో అయితే, అధికారపక్షం లాగానే, ప్రతిపక్షమూ ఒక 'షాడో' కేబినెట్‌ను అధికారికంగా ఏర్పాటు చేస్తుంది. అంటే... అధికార పక్షం ఏ మంత్రి పదవులకు తమ సభ్యులను నియమించుకుంటే.... ఆ పదవులకు ప్రతిపక్షం కూడా తమ సభ్యులను నియమించుకుంటుంది. వీరిని షాడో మినిస్టర్స్ అంటారు. అంటే, హోంమంత్రికి ఒక షాడో హోంమంత్రి, విద్యాశాఖ మంత్రికి ఒక షాడో విద్యాశాఖామంత్రి... ఇలా అన్న మాట.

ఆయా శాఖల అధికారులు తమ తమ మంత్రులకు రిపోర్ట్ చేసినట్టుగానే, షాడో మంత్రులకూ రిపోర్ట్ చేయాలి. ఈ షాడో వ్యవస్థ వ్యయాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తుంది.

ఇక్కడ మనకు... ప్రతిపక్షం అంటే...!?

అధికార పక్షం వెనకాల తిరిగేవాళ్లకు కూడా లోకువే. ఒక ఎస్.ఐ కూడా కేర్ చెయ్యడు.

"వారూ మీలాగే అబద్దాలు ఆడి, దొంగోట్లు వేయించుకుని, డబ్బు–సారా పోసి, ఉత్తుత్తి హామీలు ఇచ్చి గెలిచినవారే కదా! వాళ్ళనూ కలుపుకు వెళ్లి... ఇద్దరూ చెరో అర్ధరూపాయి తినండి.." అని మన రాజ్యాంగం ఎందుకు చెప్పలేదో తెలియదు.

అయినా సరే, మనది ప్రజాస్వామ్యం. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం. ఏ విలువలూ లేని పాలనా తీరుతెన్నుల ప్రజాస్వామ్యం. ఏ బాధ్యతా, జవాబుదారీతనం లేని పాలక పార్టీల ప్రజాస్వామ్యం చూస్తుంటే... "ఇది డెమోక్రసీ కాదు... కామెడోక్రసీ".

మన డెమోక్రసీ అటువంటిది కాబట్టే... ఇటువంటి వారు మన పాలకులయ్యారు. పాపం వాళ్ళ తప్పేముంది!?

**- భోగాది వేంకట రాయుడు**
శాన్ఫ్రాన్సిస్కో నుండి...
medhomadhanam@gmail.com

# శ్రద్ధాంజలి



జననం: 18.01.1946 మరణం: 05.11.2017

స్నేహశీలి, మృదుస్వభావి,
మంచి మనసున్న మహామనీషి, మానవతావాది

## కీ॥శే॥ ఆదాల రాఘవరెడ్డి గారు

పరమపదించి తేది. 05.11.2023 నాటికి
ఆరేళ్ళు పూర్తికానున్న సందర్భంగా
ఆ మానవతామూర్తిని స్మరించుకుంటూ...
వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తున్నాం.

భార్య
**ఆదాల అరుణ**
కుమార్తె
**ఆదాల సాయి అపర్ణ**

కుమారుడు - కోడలు
**ఆదాల వంశీకృష్ణ - రచన**
మనుమరాళ్ళు
**సాయి అనిక, సాయి అవని**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com